## విలేకరులు కావలెను

రెండు తెలుగు రాష్ట్రాల నుండి విడుదలవుతున్న సంచలన సమాచార తెలుగు దినపత్రిక 'సంక్షేమ సాక్షి' లో విలేకరులుగా పనిచేయుటకు అని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాల నుండి బ్యూరో, స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి

సెల్ : 9951813334


E.mail : sankshemasakshi@mail.com



# సంక్షేమ సాక్షి

తెలుగు దిన పత్రిక

Printed and Published From : Kurnool | చీఫ్ ఎడిటర్ : కె.రాజేశ్వరి | ఆదివారం 05 జూలై, 2026 | సంపుటి : 3 / సంచిక : 288 / పేజీలు : 8 / వెల : రూ.2/-

## ఐదో విడత రైతు భరోసా.. నిధులు విడుదల..!!

**ఈ విడతలో 6 ఎకరాల వరకు సాగుభూమి ఉన్న రైతులకు నిధులు జమ**

**అర్హులైన ప్రతి రైతుకు దశలవారీగా రైతు భరోసా సాయాన్ని అందిస్తున్నాం**

తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఐదో విడత నిధులను విడుదల చేసింది. ఈ విడతలో 6 ఎకరాల వరకు సాగుభూమి ఉన్న 1.69 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.545.41 కోట్లను జమ చేసింది.

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఐదో విడత నిధులను విడుదల చేసింది. ఈ విడతలో 6 ఎకరాల వరకు సాగుభూమి ఉన్న 1.69 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.545.41 కోట్లను జమ చేసింది. ఇప్పటి వరకు రైతు భరోసా పథకం కింద మొత్తం 67.45 లక్షల మంది రైతుల

## బలోచిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి..!!

### 30 మంది పాక్ భద్రతా సిబ్బంది మృతి

- బలోచ్ లిబరేషన్ ఆర్మీ పాకిస్థాన్‌కు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది
- తమ ఫైటర్స్ శిబిరంలోకి చొరబడి, ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు : బీఎల్ఏ ప్రతినిధి
- ఈ దాడి, మృతులకు సంబంధించి పాకిస్థాన్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది
- తమ ప్రాంతంలోని సహజవనరులపై తమకే నియంత్రణ ఉండాలి
- బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని వేర్పాటువాద గ్రూపు బీఎల్ఏ దశాబ్దాలుగా డిమాండ్ చేస్తోంది

పూర్తి వివరాలు 2వ పేజీలో



## మూడు దేశాల్లో ప్రధాని మోదీ సుడిగాలి పర్యటన..!!

**6 రోజులపాటు ద్వైపాక్షిక చర్చలు షురూ**

**తూర్పు దేశాలతో సంబంధాలను సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేందుకు మెదీ సిద్ధం**

**ఆయా దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా చర్చలు**

అంతర్జాతీయ వేదికలపై భారత పరపతిని మరింత పెంచేందుకు, తూర్పు దేశాలతో సంబంధాలను సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సిద్ధమయ్యారు. జూలై 6 నుండి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలలో ప్రధాని మోదీ సుడిగాలి పర్యటన చేయనున్నారు.

ప్రపంచదేశాలతో వ్యూహాత్మక భాగస్వామ్యం, వాణిజ్య బంధాలు, ప్రవాస భారతీయులతో ముఖాముఖి సమావేశాల లక్ష్యంగా ప్రధాని మోదీ 6 రోజుల పర్యటన సాగనుంది. ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్.. ఈ మూడు దేశాల ప్రధానుల ఆహ్వానం మేరకు జరిగే ఈ పర్యటనలో ఆయా దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా మోదీ కీలక చర్చలు జరపనున్నారు


**ఇండోనేషియా పర్యటన..** ఇండోనేషియా గణతంత్ర అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి మోదీ జూలై 6 నుంచి 8 వరకు ఇండోనేషియాలో పర్యటించనున్నారు. 2018లో భారత్-ఇండోనేషియా సంబంధాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి ఎదిగిన తర్వాత ఇది ప్రధానమంత్రి మోదీ నాలుగో పర్యటన కాగా, తొలి ద్వైపాక్షిక సందర్శనగా ప్రత్యేకత సంతరించుకుంది. జకార్తాలో అధ్యక్షుడు ప్రబోవోతో ద్వైపాక్షిక చర్చలు జరిపి, ఇరు దేశాల మధ్య సాధించిన పురోగతిని సమీక్షించనున్నారు. ఇంతేకాకుండా, జకార్తాలో ప్రవాస భారతీయుల భారీ సభను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం కూడా ఉంది. ప్రధానమంత్రి ఇండోనేషియాలోని ప్రముఖ యునెస్కో ప్రపంచ వారసత్వ

..2వ పేజీలో

## పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు షెడ్యూల్.. ఖరారైంది..!!

### జులై 20 నుంచి మొదలు..ఆగస్టు 13 వరకు కొనసాగింపు

- కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడి
- కేంద్ర ప్రభుత్వ సిఫారసుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం
- ఈ సమావేశాల్లో దేశ ప్రాధాన్య అంశాలపై విస్తృత చర్చలు..
- చట్టాలపై పరిశీలన, కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం..
- జాతీయ ప్రయోజన సంబంధిత అంశాలపై అర్థవంతమైన చర్చలు



పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు షెడ్యూల్ ఖరారైంది. ఈ ఏడాది వర్షాకాల సమావేశాలు జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు కొనసాగనున్నట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శనివారం వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ సిఫారసుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపిన అనంతరం ఉభయ సభల సమావేశాల షెడ్యూల్‌ను రిజిజు ప్రకటించారు. ఈ సమావేశాల్లో దేశ ప్రాధాన్య అంశాలపై విస్తృత చర్చలు, చట్టాలపై పరిశీలన, కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్టు కిరణ్ రిజిజు పేర్కొన్నారు. 'జాతీయ ప్రయోజన సంబంధిత అంశాలపై అర్థవంతమైన చర్చలు, సంప్రదింపులు జరగాలి' అని ఆయన ఎక్స్‌లో రాసుకొచ్చారు.

## త్వరలో కుప్పంలో బంగారం... ఉత్పత్తి చేస్తాం..!!

### కుప్పంను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం..!!



**చిత్తూరు :** కుప్పం నుంచి మరోచోటికి వెళ్లే పరిస్థితులు రాకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కుప్పం చరిత్ర మార్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు స్వర్ణ కుప్పానికి నాంది పలుకుతాయని తెలిపారు. ఈరోజు(శనివారం) కుప్పం నియోజకవర్గంలో పర్యటించిన సీఎం.. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. రాయలసీమలో పెద్ద ఎత్తున ప్రాజెక్టులు వస్తున్నాయని.. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి ఉద్యోగాల కోసం రావాలన్నారు. కుప్పం నియోజకవర్గంలో 80వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు చెప్పారు. వందల మంది పౌల్ట్రీ రైతులకు చేయూతనిస్తామని వెల్లడించారు. అడిడాస్ పరిశ్రమతో 20వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు చెప్పారు. డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్, పౌల్ట్రీ పరిశ్రమలు వచ్చాయన్నారు. మైక్రో ఇరిగేషన్ ఏపీకి శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు. రాయలసీమలో రూ.లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం తెలిపారు. హార్టికల్చర్ హబ్ కోసం ప్రైవేటు రంగం నుంచి రూ.60 వేల కోట్లు.. ప్రభుత్వం నుంచి రూ.40 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. హార్టికల్చర్ హబ్‌గా కుప్పం నియోజకవర్గం తయారుకావాలని ఆకాంక్షించారు. కుప్పంలో పూర్తిగా వాణిజ్య పంటలు చేపట్టాలని సూచించారు. వాణిజ్య, కూరగాయల పంటల ద్వారా మంచి ఆదాయం వస్తుందన్నారు. కుప్పంను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని తెలిపారు. భవిష్యత్తులో అందరూ విద్యుత్ వాహనాలు వాడాలని.. ఇకపై అన్నీ ఏసీ, ఎలక్ట్రిక్ బస్సులు వస్తాయని వెల్లడించారు. అన్ని మతాలను గౌరవించుకోవాలని సీఎం అన్నారు. ఇతర మతాల వారిపై దాడులు సరికాదన్నారు. వైసీపీ హయాంలో రాష్ట్రాన్ని దోచుకుతిన్నారని ఆరోపించారు. ఐదేళ్లలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో కుప్పం నియోజకవర్గంపై కక్ష గట్టారన్నారు. హంద్రీనీవా నీళ్లు ఇచ్చేసినట్లు డ్రామాలు ఆడారని.. సెట్టింగ్‌లు వేసి నాటకాలు ఆడారంటూ సీఎం చంద్రబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

- కుప్పం నుంచి మరోచోటికి వెళ్లే పరిస్థితులు రాకూడదు
- కుప్పం చరిత్ర మార్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం
- అభివృద్ధి కార్యక్రమాలు స్వర్ణ కుప్పానికి నాంది పలుకుతాయి
- రాయలసీమలో పెద్ద ఎత్తున ప్రాజెక్టులు వస్తున్నాయి...
- ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి ఉద్యోగాల కోసం రావాలి
- కుప్పం నియోజకవర్గంలో 80వేల మందికి ఉపాధి అవకాశాలు
- వందల మంది పౌల్ట్రీ రైతులకు చేయూతనిస్తాం...
- డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్, పౌల్ట్రీ పరిశ్రమలు వచ్చాయి..
- మైక్రో ఇరిగేషన్ రాష్ట్రానికి శ్రీరామ రక్షగా మారింది
- రాయలసీమలో రూ.లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నాం
- హార్టికల్చర్ హబ్‌గా కుప్పం నియోజకవర్గం తయారుకావాలి
- కుప్పంలో పూర్తిగా వాణిజ్య పంటలు చేపట్టాలి
- వాణిజ్య, కూరగాయల పంటల ద్వారా మంచి ఆదాయం వస్తుంది
- త్వరలో కుప్పంలో బంగారం ఉత్పత్తి చేసి స్వర్ణ కుప్పానికి నాంది పలుకుతాం
- భవిష్యత్తులో అందరూ విద్యుత్ వాహనాలు వాడాలి
- ఇకపై అన్నీ ఏసీ, ఎలక్ట్రిక్ బస్సులు వస్తాయి...:సీఎం చంద్రబాబు





రాయలసీమలో రూ.లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఇందులో ప్రైవేటు రంగం వాటా రూ.60 వేల కోట్లు కాగా.. ప్రభుత్వం రూ.40వేల కోట్ల పెట్టుబడి పెడుతున్నట్లు చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో రెండో రోజు పర్యటించిన చంద్రబాబు.. రూ.117 కోట్లతో అధునాతన బస్‌స్టేషన్, డిపో నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. కుప్పం చరిత్ర మార్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు స్వర్ణ కుప్పానికి నాంది పలుకుతాయన్నారు.

వందల మంది పౌల్ట్రీ రైతులకు చేయూతనిస్తాం. నియోజకవర్గం నుంచి పారిశ్రామికవేత్తలుగా మారేందుకు నాంది పలుకుదాం. అడిడాస్ పరిశ్రమ ద్వారా 20 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్, పౌల్ట్రీ పరిశ్రమలు వచ్చాయి. 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి స్థాయికి కుప్పం చేరుతుంది. డ్వాక్రా సంఘాల ద్వారా గడ్డి పెంచి కమ్యూనిటీ ఫోరమ్‌ల ద్వారా సరఫరా చేస్తాం. ప్రపంచవ్యాప్తంగా మారిన ఆహారపు అలవాట్ల మేరకు పంటలు రావాలి.

సంక్షేమ సాక్షి
తెలుగు దిన పత్రిక

ఆదివారం 05 జూలై, 2026

# బలోచిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి..!!

**30 మంది పాక్ భద్రతా సిబ్బంది మృతి.....బలోచ్ లిబరేషన్ ఆర్మీ పాకిస్థాన్‌కు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది**

**తమ ఫైటర్స్ శిబిరంలోకి చొరబడి, ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు : బీఎల్ఏ ప్రతినిధి...ఈ దాడి, మృతులకు సంబంధించి పాకిస్థాన్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది**

**తమ ప్రాంతంలోని సహజవనరులపై తమకే నియంత్రణ ఉండాలి....బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని వేర్పాటువాద గ్రూపు బీఎల్ఏ దశాబ్దాలుగా డిమాండ్ చేస్తోంది**

**(మొదటిపేజి తరువాయి)** బలోచ్ లిబరేషన్ ఆర్మీ పాకిస్థాన్‌కు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. తాజాగా బలోచిస్థాన్‌లోని జివానీలో గల పాకిస్థాన్ కోస్ట్ గార్డ్ శిబిరంపై ఆత్మాహుతి దాడి జరిపినట్లు ప్రకటించింది. ఈ ఘటనలో 30 మంది పాక్ జవాన్లు మరణించినట్లు పేర్కొంది. తమ ఫైటర్స్ శిబిరంలోకి చొరబడి, ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారని బీఎల్ఏ ప్రతినిధి మీడియాకు తెలిపారు. అయితే ఈ దాడి, మృతులకు సంబంధించి పాకిస్థాన్ నుంచి



అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. తమకు స్వయంప్రతిపత్తి కల్పించాలని, తమ ప్రాంతంలోని సహజవనరులపై తమకే నియంత్రణ ఉండాలని బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని వేర్పాటువాద గ్రూపు బీఎల్ఏ దశాబ్దాలుగా డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో తరచూ సైనిక, పారామిలిటరీ, ఇతర ప్రభుత్వ సంస్థలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతోంది. దీనిని పాకిస్థాన్ ఉగ్రవాదసంస్థగా ప్రకటించింది.

## మూడు దేశాల్లో ప్రధాని మోదీ సుడిగాలి పర్యటన..!!

**(మొదటిపేజి తరువాయి)** ప్రదేశమైన యోగ్యకార్తాలోని ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించి,భారత్-ఇండోనేషియా చారిత్రక,సాంస్కృతిక బంధాలను ప్రతిబింబింపజేస్తారు. **ఆస్ట్రేలియా పర్యటన..** ప్రధని మోదీ జూలై 8-10 తేదీలలో ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ ఆహ్వానం మేరకు మెల్బోర్న్‌లో పర్యటించనున్నారు. ఇక్కడ అల్బనీస్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు..ఆస్ట్రేలియా గవర్నర్ జనరల్ సామ్ మోస్టిన్‌తో కూడా సమావేశం అవుతారు.ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఇండియా-ఆస్ట్రేలియా సీఈఓల ఫోరంలో పాల్గొని ఇరు దేశాల అగ్రశ్రేణి వ్యాపార నాయకులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ప్రవాస భారతీయుల భారీ సమావేశాన్ని ఉద్దేశించి కూడా మోడీ ప్రసంగిస్తారు.


## ఐదో విడత రైతు భరోసా నిధులు విడుదల..!!

**(మొదటిపేజి తరువాయి)** ఖాతాల్లో రూ.7,135.78 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. అర్హులైన ప్రతి రైతుకు దశలవారీగా రైతు భరోసా సాయాన్ని అందిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. రైతులకు సాగు పెట్టుబడి భారాన్ని తగ్గించి, వ్యవసాయ కార్యకలాపాలకు ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తోంది. మిగిలిన అర్హులైన రైతులకు కూడా త్వరలోనే తదుపరి విడత నిధులను విడుదల చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**వెంకన్న దయ.. తన సంకల్పం.. 116 ఏళ్ల వయస్సులోనూ**

## ఎంచక్కా తిరుమల కొండ ఎక్కేసింది..

వయసు పెరిగేకొద్దీ అడుగు వేయడమే కష్టంగా మారే రోజులు వస్తాయి. 60 లేదా 70 ఏళ్లు దాటిన తర్వాత చాలా మంది మోకాళ్ల నొప్పులు, ఆయాసం, శారీరక బలహీనతతో ఇబ్బందులు



పడుతుంటారు. అలాంటి సమయంలో ఓ శతాధిక వృద్ధురాలు చూపించిన సంకల్పం ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కర్ణాటకలోని ఓ గ్రామానికి చెందిన లక్ష్మవ్వ శతాధిక వృద్ధురాలు. కొంతమంది ఆమెను భీమవ్వ అని కూడా పిలుస్తారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం 116 ఏళ్ల వయస్సులో ఉన్నారు. అధికారికంగా ఆమె వయస్సుపై నిర్ధారణ లేకపోయినా, ఆమె శతాధిక వృద్ధురాలనే విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఇంత వయస్సులోనూ ఆమె తిరుమల అలిపిరి కాలినడక మార్గాన్ని ఎంచుకున్నారు. సుమారు 3,550 మెట్లు ఉన్న ఈ మార్గాన్ని ఎవరి సహాయం తీసుకోకుండా, చేతిలో కేవలం ఒక కర్రను ఆసరాగా పట్టుకుని, గోవిందా... గోవిందా... అంటూ స్వామివారి నామస్మరణ చేస్తూ ఒక్కో మెట్టు ఎక్కుతూ తిరుమల చేరుకున్నారు. ఆమె పట్టుదల, ఆత్మవిశ్వాసం, భక్తి చూసిన సహయాత్రికులు ఆశ్చర్యపోయారు. వయస్సు శరీరానికి పరిమితులు విధించినా, మనసు బలంగా ఉంటే అసాధ్యమనుకున్న లక్ష్యాలను కూడా చేరుకోవచ్చని భీమవ్వ మరోసారి నిరూపించారు. ఈ ఘటనను చూసిన పలువురు భక్తులు, ఇంత వృద్ధాప్యంలోనూ ఆమెకు లభించిన శారీరక, మానసిక శక్తి శ్రీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహమేనని తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మరికొందరు మాత్రం ఆమె సంకల్పం, జీవనశైలి, మానసిక దృఢత్వమే ఈ ప్రయాణాన్ని విజయవంతం చేశాయని అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనా, 116 ఏళ్ల వయస్సులో అలిపిరి మెట్ల మార్గంలో తిరుమల చేరిన భీమవ్వ ప్రయాణం ఇప్పుడు వేలాది మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. వయస్సు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, దృఢమైన సంకల్పం ఉంటే ఎన్నో అద్భుతాలు సాధ్యమవుతాయని ఆమె మరోసారి చాటి చెప్పారు.

**కేవైసీ పూర్తి చేయకపోవడంతో**

## గ్యాస్ కనెక్షన్ రద్దయిందా..?

**కేవైసీ చేసుకునేందుకు జూన్ 30వ తేదీ వరకు కేంద్రం గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. కానీ చాలామంది ఇంకా ఆ ప్రాసెస్ చేసుకోలేదు. దీంతో గ్యాస్ వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. వారి కనెక్షన్లను గ్యాస్ ఏజెన్సీలు రద్దు చేస్తున్నాయి.**

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ల వినియోగదారులకు కేవైసీ చేసుకునేందుకు జూన్ 30వ తేదీ





వరకు గడువు విధించింది. అయితే గడువు ముగియడంతో సబ్సిడీ నిలిచిపోనుంది. ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన పథకం కింద కేంద్రం పేదలకు సిలిండర్ల బుకింగ్‌పై రూ.300 సబ్సిడీ అందిస్తోంది. కేవైసీ పూర్తి చేయనివారికి సబ్సిడీ కట్ కానుంది. అయితే ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన లబ్దిదారులే కాకుండా మిగతా సాధారణ వినియోగదారులు కూడా కేవైసీ పూర్తి చేయాలి. చాలామంది చేసుకోకపోవడంతో వారి బుకింగ్స్‌ను తాత్కాలికంగా ఏజెన్సీలు నిలిపివేశాయి. అలాగే వారి గ్యాస్ కనెక్షన్లను తాత్కాలికంగా కట్ చేస్తున్నారు. దీంతో గ్యాస్ కనెక్షన్ తొలగిస్తే వినియోగదారులు సిలిండర్ బుక్ చేసుకోలేరు. తమకు ఆదేశాలు వచ్చాయని, అందుకే తొలగిస్తున్నట్లు ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. తిరిగి కనెక్షన్ ఎలా పొందాలో తెలియక తికమకపడుతున్నారు. అయితే వినియోగదారులు తిరిగి గ్యాస్ కనెక్షన్‌ను పునరుద్ధరించుకోవచ్చు. ఇందుకోసం వినియోగదారులు మీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లాలి. వేలిముద్ర ద్వారా ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలి. వెంటనే మీ గ్యాస్ కనెక్షన్ పునరుద్ధరించబడుతుంది. దీంతో యథావిధిగా సిలిండర్ కోసం బుకింగ్ చేసుకోవచ్చు. గ్యాస్ కనెక్షన్ కట్ అయిందని వినియోగదారులు టెన్షన్ పడాల్సిన పని లేదు. కేంద్రం గ్యాస్ కనెక్షన్, సిలిండర్ల సరఫరాలో బ్లాక్ మార్కెటింగ్, అక్రమాలను నివారించేందుకు కేవైసీ ప్రాసెస్ తప్పనిసరి చేసింది. జూన్ 30లోగా చేసుకోవాలని కేంద్రం, గ్యాస్ కంపెనీలు పలుమార్లు కోరాయి. కానీ చాలామంది వినియోగదారులు నిర్లక్ష్యంతో చేసుకోలేదు. దీంతో వారి గ్యాస్ కనెక్షన్లను ఏజెన్సీలు తొలగిస్తున్నాయి. అయితే కేవైసీ చేయించుకోవడంలో ఆలస్యమైతే శాశ్వతం గా గ్యాస్ కనెక్షన్ రద్దు చేసే ప్రమాదం కూడా ఉందని చెబుతున్నారు. దీంతో ఇంకా చేసుకోని వినియోగదారులు త్వరగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలి. గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లి ఉచితంగా ఈ ప్రాసెస్ చేయవచ్చు. లేదా మీ ఏజెన్సీ వెబ్ సైట్, యాప్స్ ద్వారా చేసుకోవచ్చు.

# రాజస్థాన్ శిల్పకళతో జోధ్‌పూర్ ఎయిర్‌పోర్ట్ కొత్త రూపం..

**మోదీ చేతుల మీదుగా ఆధునిక టెర్మినల్ ప్రారంభం**

**రాజస్థాన్‌లో కొత్త విమాన టెర్మినల్ అందుబాటులోకి వచ్చింది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జోధ్‌పూర్ విమానాశ్రయంలో నూతనంగా నిర్మించిన కొత్త టెర్మినల్ భవనాన్ని ప్రారంభించారు. ఈ టెర్మినల్ ప్రారంభంతో జోధ్‌పూర్ విమానాశ్రయానికి ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. సుమారు 23,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ టెర్మినల్, ప్రయాణికుల రద్దీని సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా రూపుదిద్దుకుంది.**



రాజస్థాన్‌లో కొత్త విమాన టెర్మినల్ అందుబాటులోకి వచ్చింది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జోధ్‌పూర్ విమానాశ్రయంలో నూతనంగా నిర్మించిన కొత్త టెర్మినల్ భవనాన్ని ప్రారంభించారు. ఈ టెర్మినల్ ప్రారంభంతో జోధ్‌పూర్ విమానాశ్రయానికి ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. సుమారు 23,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ టెర్మినల్, ప్రయాణికుల రద్దీని సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా రూపుదిద్దుకుంది. కొత్త టెర్మినల్ భవనం రాజస్థాన్ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక కళాకృతులతో నిర్మించారు. స్థానిక శిల్పకళ, వాస్తు శైలిని మిళితం చేస్తూ రూపొందించిన ఈ నిర్మాణం రాష్ట్ర పర్యాటక రంగానికి మరింత ఊతం ఇస్తుందని అధికారులు భావిస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన ఈ టెర్మినల్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, వేగవంతమైన చెక్-ఇన్ వ్యవస్థలు, విస్తృత వేచివుండే ప్రాంతాలు వంటి ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ, జోధ్‌పూర్ వంటి చారిత్రక నగరాలు దేశ పర్యాటక రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఇలాంటి అభివృద్ధి పనులు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని తెలిపారు. కొత్త టెర్మినల్ ప్రారంభంతో జోధ్‌పూర్‌ను ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ఈ అభివృద్ధి ప్రాజెక్ట్‌తో విమాన ప్రయాణికుల రద్దీ తగ్గడమే కాకుండా, వ్యాపార, పర్యాటక రంగాలకు కూడా గణనీయమైన ప్రయోజనం కలుగుతుందని అంచనా వేస్తున్నారు. రాజస్థాన్‌లో విమాన కనెక్టివిటీ మరింత బలోపేతం కావడానికి ఈ టెర్మినల్ కీలకంగా మారనుంది. ఈ ప్రాజెక్టును మొత్తం రూ. 480 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. ఈ కొత్త టెర్మినల్ భవనం సంవత్సరానికి 20 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా రూపొందించారు. నిరాటంకమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడానికి, ఇందులో ఆధునిక ప్రయాణీకుల సౌకర్యాలు కల్పించారు. రాజస్థాన్ రాజరిక వారసత్వం నుండి వాస్తుపరంగా ప్రేరణ పొందిన ఈ టెర్మినల్, తోరణాలు, ఝరోఖాల వంటి సాంప్రదాయ అంశాలను సమకాలీన డిజైన్‌తో సజావుగా మిళితం చేస్తుంది. 5-స్టార్ గృహ రేటింగ్‌ను సాధించడమే లక్ష్యంగా, శక్తి సామర్థ్య వ్యవస్థలు, నీటి సంరక్షణ చర్యలు, పర్యావరణ అనుకూల భవన నిర్మాణ పద్ధతుల వంటి అంశాలతో, ఈ టెర్మినల్ రూపకల్పనలో సుస్థిరతకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. జోధ్‌పూర్ విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ భవనం ప్రారంభోత్సవం ఈ ప్రాంతంలో పర్యాటకం, వాణిజ్యం, ఉపాధి కల్పనకు గణనీయమైన ప్రోత్సాహాన్ని అందిస్తుంది. విమానయాన రంగానికి ఇది ఒక పెద్ద ప్రోత్సాహం. ముఖ్యంగా ప్రాంతీయ అనుసంధానంపై దృష్టి సారించింది కేంద్రం. ఇది భారతదేశ పౌర విమానయాన రంగంలో ఒక ముఖ్యమైన ముందడుగును సూచిస్తుంది. 'ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్' దార్శనికతను మరింత ముందుకు తీసుకువెళ్తుంది. రాబోయే 10 సంవత్సరాలలో రూ. 28,840 కోట్ల కేటాయింపుతో, ఈ పథకం విమానయాన ఆధారిత అభివృద్ధి తదుపరి దశను వేగవంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇది సమగ్రమైన, సుస్థిరమైన అనుసంధానాన్ని నిర్ధారించడానికి రూపొందించిన అనేక వ్యూహాత్మక అంశాలపై దృష్టి పెడుతుంది.

## సంపాదకీయం

# 25 ఏళ్ల అక్షరధామ్ ఆలయం..

**20 వేల శిల్పాలు, 108 అడుగుల విగ్రహం..**

**ప్రతి భారతీయుడు చూడాల్సిన అద్భుతం!**

**యమునా నది తీరాన వెలసిన ఢిల్లీ అక్షరధామ్ ఆలయం భారతీయ శిల్పకళ, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచింది. 20 వేలకుపైగా శిల్పాలు, 108 అడుగుల నీలకంఠ వర్ణి విగ్రహం, అద్భుతమైన నిర్మాణశైలితో ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను, భక్తులను ఆకర్షిస్తున్న ఈ ఆలయం చరిత్ర, విశేషాలు తెలుసుకోండి.**

సరిగ్గా 25 సంవత్సరాల క్రితం, 2001 జూలై 2న, యమునా నది తూర్పు ఒడ్డున నిర్మితమైన అక్షరధామ్ ఆలయ సముదాయానికి పునాది, పీఠ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అదే రోజున ఆలయ నిర్మాణానికి తొలి శిల్పాన్ని లాంఛనంగా



ప్రతిష్ఠించారు. అనంతరం నాలుగేళ్లపాటు నిరంతర శ్రమతో నిర్మాణం పూర్తై, 2005లో ఈ మహా ఆలయం ఢిల్లీ ప్రజలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు, పర్యాటకుల కోసం తన ద్వారాలు తెరిచింది. నేడు అక్షరధామ్ ఆలయం దేశ రాజధానిలోని అత్యంత ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాల్లో ఒకటిగా నిలిచింది. ఢిల్లీ వాస్తు వైభవానికి ప్రతీకగా ఈ ఆలయం గుర్తింపు పొందింది. యమునా నదీ తీరాన విస్తరించిన ఈ అద్భుత ఆలయ సముదాయం 19వ శతాబ్దపు ఆధ్యాత్మిక గురువు 'భగవాన్ స్వామినారాయణ్'కు అంకితం చేయబడింది. గులాబీ రంగు ఇసుకరాయి, తెల్లని పాలరాయితో నిర్మించిన ఈ దేవాలయంలో సుమారు 20 వేలకుపైగా అద్భుత శిల్పాలు చెక్కబడ్డాయి. ప్రతి శిల్పం భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత, శిల్పకళా నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తుంది.


**108 అడుగుల ఎత్తైన భగవాన్ స్వామినారాయణ్ కంచు విగ్రహం...** ఇటీవల ఈ ఆలయ సముదాయానికి మరో విశేష ఆకర్షణ చేరింది. బాలసన్యాసి 'నీలకంఠ వర్ణి' రూపంలో 108 అడుగుల ఎత్తైన భగవాన్ స్వామినారాయణ్ కంచు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఒక చేతిలో జపమాల ధరించి, భక్తి భావంతో చేతులు పైకెత్తి నిలిచిన ఈ మహావిగ్రహం ఆలయ సౌందర్యాన్ని మరింత పెంచింది. వెనుకవైపు నుంచి చూసినప్పుడు, ఈ విగ్రహం నేపథ్యంలో అక్షరధామ్ ఆలయం కనిపించే దృశ్యం సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. అక్షరధామ్ ఆలయం మరో విషయాన్ని కూడా గుర్తు చేస్తుంది. ఢిల్లీలోని అత్యంత వైభవమైన హిందూ దేవాలయాల్లో చాలావరకు ఆధునిక కాలంలోనే నిర్మించబడ్డాయి. వారణాసి లేదా భువనేశ్వర్‌లా ప్రాచీన ఆలయ వాస్తుశిల్పం యథాతథంగా నిలిచిన దేవాలయాలు ఢిల్లీలో చాలా తక్కువ. దీనికి కారణం 1206లో ఢిల్లీ సుల్తానేట్ ఆవిర్భావం నుంచి 1857లో మొఘల్ పాలన ముగిసే వరకు కొనసాగిన ఇస్లామిక్ రాజవంశాల పాలన. ఆ కాలంలో కోటలు, మసీదులు, సమాధులు, సూఫీ దర్గాలు నగర వాస్తు రూపాన్ని ప్రభావితం చేశాయి.

**ఢిల్లీలో మరికొన్ని గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రాలు..** అయితే గత శతాబ్దంలో ఢిల్లీలో నిర్మించిన ఆలయాలు నగరానికి కొత్త ఆధ్యాత్మిక గుర్తింపును తీసుకొచ్చాయి. వాటిలో మందిర్ మార్గ్‌లోని 'లక్ష్మీనారాయణ ఆలయం (బిర్లా మందిర్)' ప్రత్యేక స్థానం దక్కించుకుంది. విష్ణుమూర్తికి అంకితమైన ఈ ఆలయాన్ని బిర్లా కుటుంబం నిర్మించగా, 1939లో మహాత్మా గాంధీ ప్రారంభించారు. విశాలమైన ప్రాంగణం, ప్రశాంతమైన వాతావరణం, పాలరాతిపై చెక్కిన దేవతామూర్తులు, మీరాబాయి వంటి భక్తకవుల శ్లోకాలతో ఈ ఆలయం భక్తులను ఆకర్షిస్తుంది. గ్రీన్ పార్క్ సమీపంలోని 'శ్రీ జగన్నాథ ఆలయం' కూడా ఆధునిక వాస్తుశిల్పానికి మరో అద్భుత ఉదాహరణ. 1970వ దశకంలో నిర్మితమైన ఈ ఆలయం పూర్తిగా తెల్లని నిర్మాణశైలితో ప్రత్యేకంగా కనిపిస్తుంది. అలాగే తూర్పు కైలాస్ ప్రాంతంలోని 'ఇస్కాన్ ఆలయం' కూడా ఢిల్లీలోని ప్రముఖ ఆధునిక దేవాలయాల్లో ఒకటి. ధోల్పూర్ రాయి, తెల్లని పాలరాయితో నిర్మించిన మూడు ఎత్తైన శిఖరాలు ఈ ఆలయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అక్షరధామ్ ఆలయం అందాలను ఆస్వాదించడానికి సాయంత్రం సమయం అత్యుత్తమం. సూర్యాస్తమయం సమయంలో ఆలయ శిఖరం వెనుక సూర్యుడు క్షణకాలం నిలిచినట్లు కనిపించే దృశ్యం నోయిడా మోర్ సమీపంలోని రహదారి నుంచి వీక్షిస్తే మరింత అద్భుతంగా ఉంటుంది. ఆ దృశ్యం ప్రతి సందర్శకుడి మనసులో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

**12 వేల మందికి అమరనాథ్**

# తొలి దర్శనం

**జమ్మూ:** కట్టుదిట్టమైన భద్రత... వాతావరణ అవాంతరాల మధ్య ... హర హర మహాదేవ్ అంటూ... బయల్దేరిన భక్తులకు ఈ ఏడాది అమరనాథ్ మంచుశివలింగ తొలి దర్శనమైంది. అమరనాథ్ యాత్రలో భాగంగా శుక్రవారం తొలిరోజు 12 వేల మంది భక్తులు మంచులింగాన్ని దర్శించుకున్నారు. జమ్మూకశ్మీర్‌లోని హిమాలయాల్లో ఏటా ఈ సమయంలో ఏర్పడే



మంచు లింగాన్ని పూజించేందుకు గురు, శుక్రవారాల్లో నువ్వాన్, బాల్‌టాల్ బేస్ క్యాంపుల నుంచి రెండు బృందాలు బయలుదేరాయి. శుక్రవారం దర్శనం చేసుకున్నవారిలో 9,350 మంది పురుషులు, 2,250 మంది మహిళలు, 200 మంది పిల్లలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

**అమరనాథ్ భక్తులకు ప్రధాని మోదీ లేఖ...** యాత్ర మొదలైన నేపథ్యంలో భక్తులకు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా రెండు పేజీల లేఖ రాశారు. ఈ సందర్భంగా అయిదు ప్రతిజ్ఞలు చేయాలంటూ వారికి సూచించారు. పరిశుభ్రత పాటించటం.. జమ్మూకశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తులకు (వోకల్ ఫర్ లోకల్) ప్రాధాన్యం.. ట్రాఫిక్ నిబంధనలు.. పచ్చదనాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రక్షాబంధన్ రోజు తోబుట్టువులకు బహుమతిగా మొక్కలు.. దేశం ప్రథమం అనే నినాదంతో అమరనాథ్ యాత్రను సాగించాలని భక్తులను ప్రధాని కోరారు.

# రంగా సేవలు చిరస్మరణీయం

-సామినేని వెంకట కృష్ణ ప్రసాద్

**జగ్గయ్యపేట జూలై 04 సంక్షేమ సాక్షి :** శ్రీ కృష్ణ దేవరాయ సేవాసమితి ఆధ్వర్యంలో స్వర్గీయ వంగవీటి మోహన్ రంగా 79వ జయంతి సందర్భంగా జగ్గయ్యపేట పట్టణం,



కోదాడ రోడ్డులోని రంగా విగ్రహానికి జనసేన పార్టీ యువనాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీ కృష్ణ దేవరాయ సేవాసమితి సభ్యులతో కలిసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, వంగవీటి మోహన్ రంగా పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన ప్రజానాయకుడని, ఆయన ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజ సేవా కార్యక్రమాల ద్వారా రంగా సేవలను స్మరించుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షులు కామిశెట్టి అమర్నాధ్ ,ప్రధాన కార్యదర్శి గుంటక లక్ష్మీ నారాయణ,కోశాధికారి యర్రపోతు వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు గుత్తి విజయభాస్కర్ , ఉపాధ్యక్షులు కొలగాని రాము, ముత్యాల శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ పూల నాగరాజు, మహిళా కార్యదర్శులు, రంగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# జయహో అల్లూరి సీతారామరాజు

**మన్యం వీరుడు దేశభక్తుడు అల్లూరి సీతారామరాజు129.వ,జయతి వేడుకలు**

**స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ**

**హుకుంపేట జులై 04 సంక్షేమ సాక్షి :** మండల కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్ లో స్థానిక ఎస్సై దుర్గ ప్రసాద్ మరియు మానవ హక్కుల సంఘం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ సల్లంగి.



సూర్యనారాయణ చేతులమీదుగా జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై దుర్గ ప్రసాద్ మరియు సల్లంగి సూర్యనారాయణ మాట్లాడుతూ ఏజెన్సీప్రాంతంలో ఆదివాల హక్కుల కోసం, అన్యాయపు పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు కోటి కోటి వందనాలు అంటూ దేశాన్ని బ్రిటిష్ సంకెళ్ళ నుంచి విముక్తి కోసంసాయుధపోరాటాన్ని సాధనంగా చేసుకొని బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన మన్యం విప్లవ యోధుడు బానిసత్వ.విముక్తి కోసం, గిరిజన ప్రజల హక్కులకోసం, తెల్లదొరలపై తిరుగుబడిన విప్లవ గర్జన సింహం, భారత స్వాతం త్రోధ్యామానికి వెలుగు చుక్కల నిలిచిన తెలుగుదేశం,సమరయోధడు తెలుగు తేజం, మన్యం వీరుడు, ఆయన పోరాటం మన స్వాభిమానం, మనం ఆయన త్యాగం, మన ప్రేరణ,ఆయన ఆశయం మన లక్ష్యం, నేను చనిపోవచ్చు కానీ నా దేశం స్వతంత్రం అవ్వాల్సిందే ఆది నా జీవితం కంటే ఎంతో గొప్పది అంటు ఆదివాసుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు ఆయనకు జయంతి శు భాకాంక్షలు తెలుపుతు ఆయన చేసినసేవలుగురించి స్మరించుకున్నారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అరకు అసెంబ్లీ ఐటిడీపీ అధ్యక్షులు మరియు పీసా మండల ప్రధాన కార్యదర్శి జన్ని.వెంకటరమణ, టిడిపి అసెంబ్లీ ఆర్గనైజేషన్ సెక్రటరీ మరియు పేసా మండల అధ్యక్షులు చప్పాలి. శంకరరావు మరియు తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి అధ్యక్షులు వంతల.కోటేశ్వరరావు , స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది నాగిరెడ్డి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా..?

**జగన్‌కు గుడిసె ఆదికృష్ణమ్మ సవాల్..!**

**కర్నూలు జూలై 04 సంక్షేమ సాక్షి:** రాయలసీమ అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ



అధ్యక్షురాలు గుడిసె ఆదికృష్ణమ్మ సవాల్ విసిరారు. చంద్రబాబు నాయుడు హయాంలో జరిగిన అభివృద్ధి, 2019–24 మధ్య జగన్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజల ముందు చర్చించేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. శనివారం కర్నూలులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ పారిశ్రామిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. కడప జిల్లా జమ్మలమడుగులో రాయలసీమ ఉక్కు కర్మాగార నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని, తొలి దశలో రూ.4,500 కోట్లు, రెండో దశలో రూ.11,850 కోట్లతో పరిశ్రమను పూర్తి చేయనున్నట్లు చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాయలసీమ సాగు, తాగునీటి ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించామని, హంద్రీ–నీవా విస్తరణతో పాటు పలు ప్రాజెక్టుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతపురంలో కియా మోటార్స్, తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి పరిశ్రమలను తీసుకురావడంలో చంద్రబాబు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని అని స్పష్టం చేసిన ఆదికృష్ణమ్మ, టీడీపీ ఎప్పటికీ అమరావతి అభివృద్ధికే కట్టుబడి ఉంటుందని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే సూచనలు ఉంటే ప్రభుత్వం స్వీకరించేందుకు సిద్ధంగా ఉందని, వైఎస్సార్‌సీపీ అనవసర విమర్శలు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో పార్టీ నాయకులు ఆకుపోగు ప్రభాకర్, కైపా పద్మలతా రెడ్డి, వై.నాగేశ్వరరావు యాదవ్, హనుమంతరావు చౌదరి, పి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ విజేత హైస్కూల్‌లో ఘనంగా...**

# అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు

**తాళ్లపూడి జూలై 04 సంక్షేమ సాక్షి:** మండలంలోని శ్రీ విజేత హైస్కూల్‌లో శనివారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల




ప్రధానోపాధ్యాయులు డా. జె.వి. ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అల్లూరి సీతారామ రాజు జీవిత విశేషాలు, స్వాతంత్ర్య సమరంలో ఆయన పోషించిన పాత్రను విద్యార్థులకు వివరించారు. జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాయలచెరువులో రాయితీ కంది విత్తనాల పంపిణీ

**ఆత్మనిర్భర్ భారత్ పథకం కింద రైతులకు స్వల్పకాలిక పంటల ప్రోత్సాహం**

**యాడికి జూలై 04సంక్షేమ సాక్షి:** మండల పరిధిలో ని రాయలచెరువు రైతు సేవా కేంద్రంలో ఆత్మనిర్భర్ భారత్ పథకం కింద ఎల్ఆర్‌జీ–105, ఎల్ఆర్‌జీ–133–33 రకాల కంది విత్తనాలను రైతులకు రాయితీపై పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు వేలూరు రంగయ్య, వేముల పాడు సహకార సంఘం అధ్యక్షుడు నాగముని రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల





వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా మాట్లాడుతూప్రకృతి వైపరీత్యాలు, ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం కారణంగా రైతులకు తక్కువ వ్యవధిలో దిగుబడి ఇచ్చే స్వల్పకాలిక పంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. రైతులు అందుబాటులో ఉన్న రాయితీ విత్తనాలను వినియోగించుకుని ఆర్థికంగా లబ్ధి పొందాలని సూచించారు. మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు వేలూరు రంగయ్య మాట్లాడుతూప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారి పవన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి అరుణ్‌తో పాటు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముసునూరులో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం

**-90 మందికి పరీక్షలు**

**నూజివీడు /ముసునూరు జూలై 04 సంక్షేమ సాక్షి :** నియోజకవర్గం పరిధిలో గల ముసునూరు మండల కేంద్రమైన ముసునూరులో రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో



టౌన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో ముసునూరులోని దేవినేని ప్రసాద్ నివాస ఆవరణలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 90 మంది రోగులకు వైద్యులు వివిధ రకాల క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి తదుపరి వైద్య పరీక్షలు, చికిత్సల కోసం నిపుణులైన వైద్యులు సిఫార్సులు చేశారు. అనంతరం బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు డా. రవిశంకర్, డా. సురేఖ, డా. శ్రీవల్లి తదితరులు ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల స్వచ్ఛత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అలాగే పొగాకు, ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ విషయాలను తమ తల్లిదండ్రులకు కూడా తెలియజేసి వారిలో అవగాహన కల్పించాలని వైద్యులు విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు బోయపాటి ముఖర్జీ, కార్యదర్శి మల్లిసెట్టి శ్రీనివాస్, సభ్యులు సజ్జా శశికాంత్, మండా శ్రీనివాస్, యార్లగడ్డ రాజగోపాల్, పొట్లూరి ప్రసాద్, లావు మురళి, దోనేపూడి నరేంద్ర, వెంకటరత్నం, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు డా. రవిశంకర్, డా. శ్రీవల్లి, డా. సురేఖ, రేడియాలజిస్ట్ డా. గిరీష్ బాబు, మేనేజర్ లక్ష్మణ్, ముసునూరు గ్రామ ప్రముఖులు దేవినేని ప్రసాద్, తుమ్మల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

**కొణిజేటి రోశయ్య 94జయంతి సందర్భంగా**

# ఆయనను స్మరించుకుందాం

**రెంటచింతల జూన్04 సంక్షేమ సాక్షి:** మాజీ గవర్నర్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 94 జయంతి సందర్భంగా ఈరోజు కేక్ కట్ చేసి ఆయన చిత్రపటానికి





పూలమాలవేసిన కరస్పాం డెంట్ ఏచూరి వెంకట సైదయ్య నివాళులర్పించారు ఈ సందర్భంగా వెంకట సైదయ్య మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర రాజకీయాల్లో రోశయ్య తన దైన ముద్ర వేస్తు విలువలతో కూడిన రాజకీయం చేశారు నిబద్ధ తకు మారుపేరు కొణిజేటి రోశయ్య సభలో ఆయన మాటకు తిరుగు ఉండదు ఎక్కడైనా సరే చాతుర్యంతో ప్రదర్శించేవారు ప్రతిపక్షాల విమర్శలకు అదునుగా సమాధానాలు ఇచ్చేవారు ఆర్థిక మంత్రిగా 15 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు కూడా రోశయ్య సొంతం పార్టీలతో సంబంధం లేకుండా ప్రజా సమస్యలపై మాట్లాడే విషయములు ఆయనకు ఆయాన్నే చాటి ఆయన వాక్చాతుర్యంతో అసెంబ్లీలో అందరిని హడలెత్తించిన వారు ప్రతిపక్షాలను ధీటుగా ఎదుర్కొనే సత్తా ఉన్న నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు రోశయ్య అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచుకొండ నాగేశ్వరరావు, పుల్ల ప్రసాదు డీలర్ సుంకయ్య, ఏచూరి కాశీపతి, ఏచూరి సాంబశివరావు, ఏచూరి కాశి గన్నవరం నవీన్, కొత్త వెంకటేశ్వర్లు, మణి గళ్ళ సుబ్బారావు, పలుచూరు లక్ష్మీపతి, తిరువీధి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్ హాల్ట్‌కు స్వాగతం

**జన్మభూమి ఎక్స్‌ప్రెస్ సంగతేంటి..?**

**నిడదవోలు జూలై 04 సంక్షేమ సాక్షి:** నిడదవోలు రైల్వే స్టేషన్‌కు 18519/18520 విశాఖపట్నం––లోక్‌మాన్య తిలక్ (ఎల్‌టిటి) ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ మంజూరు కావడం స్థానికంగా




స్వాగతించదగ్గ పరిణామంగా మారింది. ఈ నిర్ణయంతో ముంబై వైపు ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపార వేత్తలు, సాధారణ ప్రయాణికులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ హాల్ట్ సాధనకు కృషి చేసిన ప్రజాప్రతినిధులను స్థానికులు అభినందిస్తున్నారు. అయితే ఇదే సమయంలో నిడదవోలు ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్న విశాఖపట్నం––హైదరాబాద్ జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ విషయంలో ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంపై స్థానికుల్లో తీవ్ర నిరాశ వ్యక్తమవుతోంది. ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్నప్పటికీ, వారికి అత్యంత అవసరమైన జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు నిడదవోలులో హాల్ట్ లేకపోవడం అసంతృప్తికి కారణమవుతోందని వారు పేర్కొంటున్నారు. ప్రజలకు అత్యవసరమైన రైళ్లకు హాల్టులు కల్పించాల్సిన అవసరం ఉన్న సమయంలోఒక్క రైలుకు హాల్ట్ మంజూరు చేయడం ద్వారా ప్రజల ఆకాంక్షలు పూర్తిగా నెరవేరినట్లు భావించడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అభివృద్ధి అనేది ప్రచారానికి పరిమితమయ్యే చర్యలు కాకుండా ప్రజల నిత్యావసరాలు, ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని తీసుకునే శాశ్వత నిర్ణయాల రూపంలో ఉండాలని వారు కోరుతున్నారు. నిడదవోలు రైల్వే స్టేషన్ ప్రాధాన్యత, ప్రయాణికుల సంఖ్య, ప్రాంతీయ అవసరాలను పరిగణనలోకి తీసుకుని జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఇతర ప్రధాన రైళ్లకు కూడా హాల్టులు మంజూరు చేసే దిశగా కేంద్ర రైల్వే శాఖ, సంబంధిత ప్రజాప్రతినిధులు సమగ్రంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# డెంగ్యూపై దండయాత్ర

**మబ్బుచింతలపల్లిలో ఇంటింటా ఫీవర్,లార్వా సర్వే**

**సిద్దయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**

**వేముల జూలై04 సంక్షేమ సాక్షి:** వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మబ్బుచింతలపల్లి గ్రామంలో శనివారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలను నిర్వహించారు. సబ్



యూనిట్ అధికారి సిద్ద య్య ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటా తిరిగి ఫీవర్ సర్వేతో పాటు లార్వా సర్వే చేపట్టారు. నిల్వ నీటిని పరిశీలించి దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టారు. ప్రజలకు డెంగ్యూ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ వంటి వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారానికి ఒకరోజు తప్పనిసరిగా డ్రై డే పాటించి నీటి తొట్లు,డ్రమ్ములు, కూలర్లు,పూల కుండీల్లో నిల్వ నీటిని తొలగించాలని కోరారు. పాత టైర్లు, కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జ్వరం,ఒళ్లు నొప్పులు,కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా రక్త పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త శ్రీనివాసులు,ఆశా కార్యకర్త హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి వీరత్వం,వివేకానందుని ధీరత్వం యువతకు..

# స్ఫూర్తి దాయకం- ఎమ్మెల్యే తాతయ్య

**జగ్గయ్యపేట జూలై 04 సంక్షేమ సాక్షి:** స్వామి వివేకానంద వర్ధంతి, భారత స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వారి విగ్రహాలకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్థానిక టీడీపీ నాయకులు, పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని, ఆయన బోధనలు నేటికీ యువతను దేశసేవ, వ్యక్తిత్వ వికాసం వైపు నడిపిస్తున్నాయని అన్నారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికతను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడిగా స్వామి వివేకానందను దేశం ఎల్లప్పుడూ గౌరవంగా స్మరించుకుంటుందని అన్నారు. అల్లూరి




సీతారామరాజు బ్రిటిష్ పాలనకు ఎదురు నిలిచి ఆదివాసీల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని కొనియాడారు. ఆయన త్యాగం, ధైర్యసాహసాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, దేశభక్తి, త్యాగనిరతికి ఆయన జీవితం చిరస్మరణీయమని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య నిరాడంబరతకు, నిజాయితీకి, పరిపాలనా దక్షతకు ప్రతీకగా నిలిచారని తాతయ్య అన్నారు. ప్రజాసేవను ధ్యేయంగా తీసుకుని రాజకీయాల్లో విలువలకు కట్టుబడి పనిచేసిన నాయకుడిగా రోశయ్య అందరికీ ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రముఖులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

సంక్షేమ సాక్షి
తెలుగు దిన పత్రిక
ఆదివారం 05 జూలై, 2026

### ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత హోమియో మలేరియా

# నివారణ మందుల పంపిణీ

**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు**

**పార్వతీపురం జూలై 04 సంక్షేమ సాక్షి :** పార్వతీపురం మన్యం జిల్లాలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత హోమియో మలేరియా నివారణ మందుల పంపిణీ కార్యక్రమం



జరుగుతోందని ఆయుష్ అధికారి డా. బి.సుశీల తెలిపారు. ఆయుష్ కమిషనర్ ఆదేశాల మేరకు, మలేరియా రాకుండా ముందస్తు నివారణగా ఈ మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మలేరియా నివారణలో భాగంగా 'చైనా ఆర్స్ అనే హోమియోపతి మందును మూడు రోజుల పాటు ఉదయాన్నే పరగడుపున వేసుకోవాలని ఆమె సూచించారు. పెద్దలు రోజుకు ఒకసారి చొప్పున 6 పిల్స్ (మాత్రలు), వరుసగా 3 రోజులు వేసుకోవాలని, 10 ఏళ్ల లోపు పిల్లలు రోజుకు ఒకసారి చొప్పున 4 మాత్రలు వరుసగా 3 రోజులు వేసుకోవాలని అన్నారు. ప్రతి సంవత్సరం మనం వ్యాక్సిన్లు వేసుకున్నట్లే, ఈ హోమియో మలేరియా నివారణ మందును వేసుకోవడం ద్వారా మలేరియాకు కారణమయ్యే పారాసైట్ మన శరీరంలో బలహీనపడుతుందని, తద్వారా మలేరియా రాకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చని స్పష్టం చేశారు. మందులతో పాటుగా ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా దోమలు చేరకుండా, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. బయటకు వెళ్లి వచ్చిన వెంటనే చేతులు, కాళ్ళు శుభ్రపరచుకోవాలని, దోమలు లేని పరిశుభ్రమైన వాతావరణం ద్వారానే ఈ మలేరియా వ్యాధిని పూర్తిగా అరికట్టవచ్చని వివరించారు. ఈ విషయాలపై ఇప్పటికే గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. మలేరియా నివారణ మందులు కావలసిన వారు పార్వతీపురం పట్టణంలోని జిల్లా హాస్పిటల్‌లో గల 'ఆయుష్ విభాగం' (హోమియోపతి) ను సంప్రదించ వచ్చని, ప్రజలందరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఈ సందర్భంగా కోరారు.

### వంగవీటి రంగా-అల్లూరి ఆశయాలు సమాజానికి

# స్ఫూర్తిదాయకం: చిర్ల జగ్గిరెడ్డి

**చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన వైస్సార్సీపీ నాయకులు**

**కోనసీమ/రావులపాలెం జూలై 04 సంక్షేమ సాక్షి:** ప్రజా హక్కుల కోసం,బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన వంగవీటి మోహన్ రంగా , బ్రిటిష్ పాలకులపై





తిరుగుబాటు చేసిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుల ఆశయాలు సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయక మని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు.శనివారం వంగవీటి మోహన్ రంగా మరియు అల్లూరి సీతారామరాజుల జయంతిని పురస్క రించుకుని గోపాలపురం గ్రామంలో రావులపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మరియు రావుల పాలెం పరిసర ప్రాంతాల్లోని మహనీ యుల విగ్రహాలకు, చిత్రపటాలకు చిర్ల జగ్గిరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


**పేదల పక్షపాతి రంగా.. విప్లవ వీరుడు అల్లూరి:** ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ.ప్రజల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం జీవితాన్ని అంకితం చేసిన ధీశాలి వంగవీటి రంగా అని కొనియాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల పక్షాన ఆయన చేసిన పోరాటాలు చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచిన రంగా జీవితం ఎంతోమందికి ఆదర్శమని పేర్కొన్నారు. అదేవిధంగా, భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం, ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడిలోనూ దేశభక్తిని పెంపొందిస్తాయని చెప్పారు. స్వేచ్ఛ కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన అల్లూరి సేవలను దేశం ఎన్నటికీ మరువదన్నారు. మహనీయులు చూపిన విలువలు, ఆశయాలు, త్యాగస్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకాలు. వారు చూపిన మార్గంలో నడుస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయడమే ఆ మహనీయులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని చిర్ల జగ్గారెడ్డి పేర్కొన్నారు.


**పెద్ద సంఖ్యలో హాజరైన నాయకులు:** ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ సామాజిక వర్గాల ప్రముఖులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారంతా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

# సమాజ సేవకు దక్కిన సముచిత గౌరవం

**డి.పి. మస్తాన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం**

**తర్లపాడు జూలై 04 సంక్షేమ సాక్షి:** సమాజ సేవే పరమావధిగా, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా గత 15 సంవత్సరాలుగా నిరంతరం శ్రమిస్తున్న ప్రముఖ సామాజిక సేవకుడు



డి. పి. మస్తాన్ గారికి అరుదైన గౌరవం దక్కింది. సమాజాభివృద్ధి, మానవతా సేవలు మరియు ప్రజా సంక్షేమ రంగాల్లో ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ప్రతిష్టాత్మక'యునైటెడ్ అమెరికా యూనివర్సిటీ'వారు ఆయనకు గౌరవ డాక్టరేట్ ను ప్రదానంచేశారు.పాండిచ్చేరిలో శనివారం అత్యంత వైభవంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించిఈ డాక్టరేట్ డిగ్రీని అందజేశారు.గౌరవ డాక్టరేట్ అందుకున్న అనంతరం డి. పి. మస్తాన్ గారు మాట్లాడుతూఈ అరుదైన గౌరవం తనపై సమాజం పట్ల మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. ఈ అవార్డు తన ఒక్కరికే కాకుండా, గత 15 ఏళ్ల తన సేవా ప్రయాణంలో అడుగడుగునా అండగా నిలిచిన తన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, సహచరులకు మరియు సమాజంలోని ప్రతి ఒక్కరికీ అంకితం ఇస్తున్నట్లు ప్రకటించారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే అంకితభావంతో, మరింత ఉత్సాహంతో సామాజిక సేవలను కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు. గత దశాబ్ద కాలానికి పైగా నిస్వార్థంగా సేవలందిస్తూ, నేడు అంతర్జాతీయ యూనివర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్ అందుకున్న డి. పి. మస్తాన్ గారికి స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, స్నేహితులు మరియు అభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయన సేవా గుణం అందరికీ ఆదర్శం కావాలని పలువురు ఆకాంక్షించారు.

# మీ ఓటు సురక్షితమేనా..? ఎస్ఐఆర్‌పై ఓటర్లలో పెరుగుతున్న ఆందోళన..!

**ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలకు అయోమయం గడువు పొడిగించాల్సిన అవసరం ఉందా..?**

**ఉదయగిరి జూలై 04సంక్షేమ సాక్షి:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా గందరగోళానికి దారితీస్తోందని, దీంతో తమ ఓటు ఉంటుందా? లేదా తొలగిపోతుందా? అనే ఆందోళన ఓటర్లలో నెలకొంటోందని ఉదయగిరి పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ దస్తగిరి అహ్మద్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ, సాధారణంగా ఏ సర్వే నిర్వహించినా ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా ప్రశ్నాపత్రాలు రూపొందిస్తారని, అయితే ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియలో ఉపయోగిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాలు మాత్రం సామాన్య ప్రజలకు అర్థం కాని విధంగా, అత్యంత క్లిష్టంగా రూపొందించబడినట్లు కనిపిస్తున్నాయని విమర్శించారు. ఈ ఫారాల రూపకల్పన ఓటర్లకు ఇబ్బందులు కలిగించేలా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సాధారణంగా ఓటరు జాబితాల సవరణలో మరణించిన వారి పేర్లు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లను తొలగించడం, 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్లను చేర్చడం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన వారికి ఓటు హక్కు కల్పించడం వంటి చర్యలే చేపడతారని చెప్పారు. అయితే ఈసారి కొత్త ఓటరు జాబితా రూపొందిస్తున్న విధానంలో గతంలో ఎన్నోసార్లు ఓటు హక్కు



వినియోగించుకున్న వారిని కూడా అదనపు వివరాలు, పాత ఆధారాలు సమర్పించాలని కోరడం ప్రజల్లో అయోమయానికి కారణమవుతోందన్నారు. ముఖ్యంగా 2002 సంవత్సరం నాటికే ఓటు హక్కు కలిగి ఉన్నారా? తర్వాత ఓటరు జాబితాలో చేరారా? చేరితే దానికి సంబంధించిన ఆధారాలు ఏమిటి? వంటి ప్రశ్నలు అడగడం వల్ల చాలా మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వివాహం చేసుకుని వచ్చిన మహిళల ఓటు హక్కుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే ఓటరు జాబితాలో పేర్లలో స్పెల్లింగ్ పొరపాట్లు ఉన్నా కూడా ఓటు కోల్పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తికాలేదని, ఫారాలు నింపించి బీఎల్‌వోలకు అందజేసి వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించడానికి మరింత సమయం అవసరమని తెలిపారు. ప్రస్తుతం ఉన్న గడువు సరిపోదని, ఎన్నికల సంఘం గడువును పొడిగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉదయగిరి పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 10 మంది బీఎల్ఏలు (బూత్ లెవల్ ఏజెంట్లు) పనిచేస్తున్నారని, ఓటరు జాబితాలో పేర్లు పరిశీలించుకోవడం, ఎన్యుమరేషన్ ఫారాలు నింపడం లేదా ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే వారిని సంప్రదించాలని సూచించారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రతి ఓటరు వెంటనే తమ ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి సంబంధిత బీఎల్‌వోలకు అందజేయాలని, నిర్లక్ష్యం చేస్తే ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉండొచ్చని షేక్ దస్తగిరి అహ్మద్ పిలుపునిచ్చారు. అలాగే ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆయన కోరారు.

# ఎల్ నినో ప్రభావంపై అవగాహన ర్యాలీ

**చౌడేపల్లి జూలై 04 సంక్షేమ సాక్షి :** మండలంలోని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలోఎల్ నినో ప్రభావంపై అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ సంవత్సరం ఎల్ నినో



ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతుంది వడగాలులు ఎక్కువగా ఉంటాయి.దీనిని ఎదుర్కో వడానికి వరి సాగుకు బదులుగా తక్కువ కాలంలో పండే,బెట్ట పరిస్థి తులను ఎదుర్కొనే జొన్న,సజ్జ,రాగులు లాంటి పంటలను సాగు చేసుకోవాలి.ప్రీ మన్సూన్ డ్రై సోయింగ్ వర్షాలకు ఒకటి రెండు వారాల ముందే పొడి నేలలో విత్తనాలు నాటడం వల్ల వేర్లు బలంగా పెరిగి బెట్టను తట్టుకుంటాయి.ఈ కార్యక్రమంలో ఎస్టి రైతులకు 50శాతం సబ్సిడీ కింద కంది విత్తనాలు అందజేయడం జరిగింది.బోర్ బావులు కలిగిన రైతులు డ్రిప్ ఇరిగేషన్ ప్రభుత్వం ఇచ్చే రాయితీతో డ్రిప్పు పరికరాలు అమర్చుకొని తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసుకోవచ్చని మరియు అధిక దిగుబడి పొందవచ్చని తెలియజేశారు.ర్యాలీలో వ్యవసాయ అధికారి మోహన్ కుమార్,డి ఆర్ డి ఏ ఏపిఎం సుబ్రమణ్యం సంఘమిత్ర సభ్యులు రైతులు పాల్గొన్నారు.

### ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్‌పై

# జాతీయ స్థాయి ఆన్‌లైన్ వర్క్‌షాప్

**పాణ్యం జూలై 05 సంక్షేమ సాక్షి :** మండల పరిధిలోని ఆర్‌జీఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ,ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో





ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సహకారంతో రియల్-వరల్డ్ ఏఐ అప్లికేషన్స్ కోసం డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్ అంశంపై ఒక రోజు జాతీయ స్థాయి ఆన్‌లైన్ వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ సర్వర్స్ సంస్థ సీఈఓ, ఎం.డి.సాయి సతీష్ ప్రధాన వనరుల నిపుణుడిగా పాల్గొని, కృత్రిమ మేధస్సు ఆధారిత డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్, కంప్యూటర్ విజన్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ సాంకేతికతల వినియోగంపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. వైద్య రంగంలో వ్యాధుల నిర్ధారణ, వ్యవసాయంలో పంటల ఆరోగ్య విశ్లేషణ, పరిశ్రమల్లో ఆటోమేషన్, భద్రతా వ్యవస్థల్లో చిత్ర విశ్లేషణ ప్రాముఖ్యతను వివరించారు.అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎం. విజయ్ మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కె. రసూల్ రెడ్డి ప్రత్యేక సాంకేతిక సెషన్లు నిర్వహించి,ఆధునిక ఇమేజ్ ప్రాసెసింగ్ పద్ధతులు,పరిశోధనా అవకాశాలు, పరిశ్రమల్లో వాటి అనువర్తనాలపై వివరించారు.కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకొని, భవిష్యత్‌లో ఏఐ ఆధారిత పరిశోధనలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకున్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. టి.జయచంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించగా ఈసీఈ విభాగాధిపతి డా. జె. సోఫియా ప్రియదర్శిని కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు,వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మంజునాథను పరామర్శించిన...

# మాజీ ఏడీసీసీ చైర్మన్ వీర

**పామిడి జూలై 04 సంక్షేమ సాక్షి:** మండల పరిధిలోని గజారాంపల్లి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మంజునాథ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం




తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఏడీసీసీ చైర్మన్ వీర శనివారం మంజునాథ స్వగృహానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా మంజునాథ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న వీర, అధైర్యపడవద్దని, త్వరలోనే పూర్తిగా కోలుకుని తిరిగి విధుల్లో చేరుతావని భరోసా కల్పించారు. ఆయన త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, రమేష్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

### మార్కెట్ యాడ్ చైర్మన్ ను పరామర్శించిన...

# ఎమ్మెల్యే గిత్త జయసూర్య

**నందికొట్కూర్ జూలై 04 సంక్షేమ సాక్షి:** నందికొట్కూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాదరెడ్డి ఇటీవల మోకాళ్ల నొప్పుల ఆపరేషన్ చేయించుకున్న విషయము తెలుసుకొని నందికొట్కూరు



నియోజకవర్గం శాసనసభ్యులు గిత్త జయ సూర్య శనివారం చైర్మన్ స్వగ్రామమైన బొల్లవరం గ్రామం కు వెళ్లి ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు జరిగిన శస్త్ర చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా కోల్పోయిన వారికి తిరగవద్దు అని ఆయన చెప్పారు. ఎమ్మెల్యే గిత్త జయ సూర్య వెంట పగి డ్యాముల టిడిపి మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి చైర్మన్ పరిమార్శించిన వారిలో ఉన్నారు.

### క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో...

# అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి వెల్లంపల్లి**


**విజయవాడ జూలై 04 సంక్షేమ సాక్షి:** విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 54 డివిజన్లో క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బాలరాజు వెంకట రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి పశ్చిమ నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు మన్యం వీరుడు అల్లూరి సీత రామరాజు గారి 129వ జయంతి కార్యక్రమం లో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసిఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు మిఠాయిలు పంచినారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో తెల్లదొరల గుండెల్లో నిద్రపోయిన విప్లవ జ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. కేవలం 27 సంవత్సరాల చిన్న వయసులోనే దేశ స్వేచ్ఛ కోసం, పరాయి పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా ఆయనసాగించిన పోరాటం అద్వితీయం, చిరస్మరణీయమని పేర్కొన్నారు. సాయుధ పోరాటం ద్వారానే బ్రిటిష్సామ్రాజ్యాన్ని గడగడ లాడించవచ్చని నిరూపించిన మహోన్నత దేశభక్తుడు అల్లూరి అని కొనియాడినారు వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ గిరిజనుల హక్కులను కాలరాస్తున్న అప్పటి బ్రిటీష్ ప్రభుత్వ చట్టాలపై అల్లూరి గర్జించారని గుర్తుచేశారు. మన్యం ప్రజలను ఏకం చేసి, వారిలో స్వదేశీ



చైతన్యాన్ని రగిల్చి, చారిత్రాత్మక 'రంప విప్లవానికి' ఆయననాయకత్వం వహించారన్నారు. సాంప్రదాయ విల్లంబులు, కొద్దిపాటి ఆయుధాలతోనే వ్యూహాత్మకగెరిల్లాపోరాటాన్ని నడిపి, బ్రిటీష్ పోలీస్ స్టేషన్లపై దాడి చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్న ఆయన యుద్ధతంత్రం చరిత్రలో నిలిచిపోతుందని స్పష్టం చేశారు. వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి మైనారిటీ బాజీ బాబా మాట్లాడుతూ.స్వార్థం లేనిత్యాగానికి,అచంచలమైన ధైర్యానికి అల్లూరి సీతారామరాజు నిలువెత్తు రూపమని బాజీ బాబా కొనియాడారు. మాతృభూమి విముక్తి కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన ఆయన అమరత్వం ప్రతి భారతీయుడి గుండెల్లో అగ్రేసరమై వెలుగుతోందని, నేటి తరం యువతకు ఆయన దేశభక్తి, పోరాట పటిమ ఎప్పటికీ ఆదర్శమని అన్నారు. అల్లూరి ఆశయాలను స్మరిస్తూ, ఆయనకు ఘన నివాళు లర్పిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసిపి మాజీ కార్పొరేటర్లు వై చలపతిరావు 54వ డివిజన్ అధ్యక్షుడు అప్సర్ క్షత్రియ సేవా సంఘం సెక్రెటరీ ఎస్ వెంకటరామరాజు ఉపాధ్యక్షుడు బి నాగరాజు కమిటీ సభ్యులు రెడ్డి చర్ల కిషోర్ వర్మ సిహెచ్ అచ్యుత రాజు ఆత్మకూరు వెంకటరాజు యువజన అధ్యక్షుడు సాము నూరురాజుబిసత్యనారాయణ రాజు సిహెచ్ సుబ్బరాజు , వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మావిగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి
# డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

**నరసరావుపేట జులై 04 సంక్షేమ సాక్షి :** మావిగన్ ప్రాజెక్టుతోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, అమరా వతిని కలిపి మావిగన్ క్యారిడార్‌గా అభివృద్ధి చేయాలన్నది జగన్మోహన్ రెడ్డి ఆలోచన అని తెలిపారు. విజయవాడ, గుంటూరు, మచిలీపట్నంలో ఇప్పటికే ప్రజలు నివసిస్తున్నారని, అన్ని వసతులు ఉన్నాయని, తక్కువ ఖర్చుతో త్వరగా రాజధాని అభివృద్ధి చేయవచ్చని అన్నారు. హైదరాబాద్-సికింద్రాబాద్ తరహాలో మహానగరం ఏర్పడుతుందని చెప్పారు. అమరావతి నిర్మాణంపై విమర్శలు గుప్పించారు. 7-8 ఏళ్లుగా పనులు సాగుతున్నా పూర్తి కాలేదని, మొదటి విడతలో రైతుల నుంచి సేకరించిన 34 వేల ఎకరాలకు ఇప్పటికీ ప్లాట్లు అప్పగించలేదని ఆరోపించారు. అభివృద్ధి చేయకుండానే రెండో విడతలో 50 వేల ఎకరాలకు నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. రాజధానిలో చదరపు అడుగుకు రూ.15-20 వేలు ఖర్చు చేస్తుండగా, కేంద్ర ప్రభుత్వ భవనాలకు రూ.4000 మాత్రమే అవుతోందని పేర్కొన్నారు. 2500 ఎకరాల్లో రైల్వే స్టేషన్, 4000 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణాలు సాధ్యమేనా అని ప్రశ్నించారు. అమరావతి వరద ముంపు ప్రాంతమని, గత ఏడాది కొండవీటి వాగు వరదతో కాజా టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై నీరు చేరిందని గుర్తుచేశారు. ఆంధ్రజ్యోతి పత్రికలోనే రాజధాని పనులు నత్తనడకన సాగుతున్నాయని, 44.6 శాతం లక్ష్యానికి 18 శాతం మాత్రమే పూర్తయిందని రాశారని తెలిపారు. 2017లో ప్రారంభించిన అసెంబ్లీ, జడ్జి క్వార్టర్స్ నిర్మాణాలు ఇప్పటికీ పూర్తి కాలేదని అన్నారు. అమరావతిని వదిలేస్తామని తాము చెప్పడం లేదని, మావిగన్‌లో కలుపుకుని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర బడ్జెట్ మొత్తం రాజధానికే కేటాయిస్తే పెన్షన్లు, ఆరోగ్యశ్రీ పథకాలకు నిధులు ఉండవని అన్నారు. అనంతరం ా×= కార్యక్రమంపై మాట్లాడుతూ, గత నెల 14 నుంచి జరుగుతున్న ఓటరు వెరిఫికేషన్ నెమ్మదిగా సాగుతోందన్నారు. నరసరావుపేట పట్టణంలో 15 వేల ఓట్లు ట్రేస్ కావడం లేదని, అద్దెకు ఉండి వెళ్లిపోయిన వారు తమ బూత్‌ల వద్ద బీఎల్ఓలను కలిసి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయాలని కోరారు.



## ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై
# అవగాహన ముఖ్యం

**ఈ-వేదికలను సద్వినియోగం చేసుకోండి- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ జులై 04 సంక్షేమ సాక్షి:** ప్రస్తుత డిజిటల్ యుగంలో ఉత్పత్తులకు విస్తృత మార్కెట్‌ను చేరుకోవాలంటే ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై అవగాహన పెంపొందించుకోవడం అత్యంత అవసరమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి రైజ్ కేంద్రంలో శనివారం జరిగిన హస్తకళా ఉత్పత్తుల తయారీ వర్క్‌షాప్‌తో పాటు ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హాజరై శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి.. స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపారులు, చేతివృత్తిదారులు ఈ-కామర్స్ వేదికలను సమర్థంగావినియోగించుకోవడం ద్వారా తమ ఉత్పత్తులను స్థానిక మార్కెట్‌కే పరిమితం కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో విక్రయించే అవకాశంకలుగుతుందన్నారు. డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా ప్రచారం, ఆన్‌లైన్ చెల్లింపులు, ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌ల వినియోగంపై అవగాహన పెంచుకోవడం ద్వారా వ్యాపార అవకాశాలు మరింత విస్తరిస్తాయని పేర్కొన్నారు. ఉత్పత్తుల నాణ్యత, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, సరైన బ్రాండింగ్‌తో పాటు ఆన్‌లైన్ ప్రచారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావుతో పాటు స్టెల్లా కాలేజ్ అధ్యాపకులు పాల్గొన్నారు.






## రైతులు నేల పరిరక్షణకై..
# ఎరువుల వాడకం తగ్గించాలి- ఎమ్మెల్యే గిత్త

**సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యతనివ్వాలి- సైంటిస్ట్ ధనలక్ష్మి.**

**నందికొట్కూర్ జులై 04 సంక్షేమ సాక్షి :** రైతులు నేలను పరి రక్షించేందుకు ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలని నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య రైతులకు పిలుపునిచ్చారు. శనివారం నందికొ ట్కూరు పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో యాగంటి పల్లె శ్రీ హనుమంతరాయ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ సొసైటీ,కృషి విజ్ఞాన కేం ద్రం, వ్యవసాయ శాఖ నందికొట్కూరు ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ మేళా కార్యక్రమం సీనియర్ సైంటిస్ట్ ధనలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందికొ ట్కూరు నియోజకవర్గం శాసనసభ్యులు గిత్త జయసూర్య హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమ ముఖ్య ఉద్దేశం లక్ష్యాలు భూసార సంరక్షణలు నేల ఆరోగ్యాన్ని కాపాడి సారవంతమైన పంటలను పండించడం ద్వారా సహజ సాగు పురుగుమందుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు పిలుపునిచ్చారు. రైతులు నేల ఆరోగ్య పరిరక్షణ పై అవగాహన పెంచుకోవాలన్నారు. సీనియర్ సైంటిస్ట్ ధనలక్ష్మి మాట్లాడుతూ ఎరువులు పరిమితంగా వాడి ఖర్చు మాత్రమే కాకుండా నేల ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలని రైతులకు సూచించారు. పంట మార్పిడి పద్ధతులు కలంబించి పంట దిగుబడులు పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, నందికొట్కూరు సొసైటీ చైర్మన్ మూర్తి జావలి, మద్దూరు సాగునీటి సంఘం చైర్మన్ తిమ్మారెడ్డి,ఏ డి ఏ గిరీష్, కెవికె అడ్మినిస్ట్రేటివ్ అధికారి సురేష్ కుమార్, కెవికె శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు,కృష్ణమూర్తి,రవి గౌడ్,లక్ష్మీ ప్రియ,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తోపాటు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.





# ఆంధ్రుల ఆత్మగౌరవానికి చిరస్మరణీయ ప్రతీక అల్లూరి సీతారామరాజు

**టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా 129వ జయంతి వేడుకలు**

**అల్లూరి త్యాగం, ధైర్యం, దేశభక్తి యువతకు శాశ్వత స్ఫూర్తి: ఆర్. మోహన్‌రావు నాయుడు**

**తిరుమల జూలై 04 సంక్షేమ సాక్షి:** స్వాతంత్ర్య సమర చరిత్రలో చెరగని ముద్ర వేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆంధ్రుల ఆత్మగౌరవానికి చిరస్మరణీయ ప్రతీక అని, ఆయన త్యాగం, ధైర్యసాహసాలు, దేశభక్తి నేటి యువతకు శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తాయని మన్యం జిల్లా సీతంపేటకు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఆర్. మోహన్‌రావు నాయుడు పేర్కొన్నారు. టీటీడీ సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో శనివారం నిర్వహించిన అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో, దేశభక్తి భావాలతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న ఆర్. మోహన్‌రావు నాయుడు మాట్లాడుతూ, బ్రిటిష్ పాలనలో ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులు తీవ్ర అణచివేత, దోపిడీకి గురయ్యారని, అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అల్లూరి సీతారామరాజు గిరిజనులను ఏకం చేసి వారి హక్కుల కోసం వీరోచిత పోరాటం చేశారని తెలిపారు. అల్లూరి గిరిజనులను దురలవాట్లకు దూరం చేసి, యుద్ధ విద్యలు, గెరిల్లా పోరాట పద్ధతుల్లో శిక్షణనిచ్చి బ్రిటిష్ పాలకులను ధైర్యంగా ఎదుర్కొన్న మహానాయకుడని కొనియాడారు. ఆయన త్యాగం, దేశభక్తి, ధైర్యసాహసాలు ప్రతి యువకుడికి ఆదర్శప్రాయమని, ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ సేవకు అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. టీటీడీ సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో ఆనందరాజు





మాట్లాడుతూఅల్లూరి సీతారామరాజు తన అసమాన త్యాగం, వీరోచిత పోరాటంతో మన్య ప్రాంతానికి చిరస్థాయి కీర్తిని తీసుకువచ్చారని అన్నారు. ఆయన సేవా స్ఫూర్తిని ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో ఆచరణలో పెట్టాలని సూచించారు. టీటీడీ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలను నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. టీటీడీ చీఫ్ ఆడిట్ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూసాయుధ పోరాటం ద్వారా మన్యం ప్రజల హక్కుల కోసం చివరి శ్వాస వరకు పోరాడిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని తెలిపారు. నేటి యువత ఆయన ధైర్యాన్ని స్ఫూర్తిగా తీసుకుని జీవితంలోని ప్రతి సవాలును ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమానికి ముందు టీటీడీ సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అన్నమయ్య విగ్రహానికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా పలువురు టీటీడీ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు అల్లూరి జీవితం, దేశభక్తి, స్వాతంత్ర్య సమరంలో ఆయన పోషించిన విశిష్ట పాత్రను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఘనంగా నివాళులర్పించారు.

## గోదావరి పుష్కర పనులకు...
# తొలి విడతగా రూ.580 కోట్లు

**జూలై 11న మళ్లీ జిల్లా పర్యటన: మంత్రి నారాయణ**

**శాశ్వత మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం**

**రాజమహేంద్రవరం జూలై 04సంక్షేమ సాక్షి:** గోదావరి మహా పుష్కరాలు--2027ను దృష్టిలో ఉంచుకుని రాజమహేంద్రవరం నగరంలో తొలి దశ అభివృద్ధి పనులకు



రూ.580 కోట్ల నిధులు వివిధ పథకాల ద్వారా కేటాయిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డా. పి. నారాయణ తెలి పారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం



రూ.150 కోట్లు విడుదల చేయ నున్నట్లు వెల్లడించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, కలెక్టర్ కీర్తి చేకూరి, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులతో కలిసి పుష్కర ఏర్పాట్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. పుష్కరాలకు ముందే రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, ఘాట్ల అభివృద్ధి వంటి పనులను శాశ్వత ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 11న మరోసారి జిల్లా పర్యటనకు వస్తానని, అప్పటిలోగా ప్రాధాన్య పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తే పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. గోదావరి నది కాలుష్య నివారణకు రూ.140 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్ పుష్కరాల నాటికి అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కోరగా, ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.

## 'సర్' కార్యక్రమాన్ని...
# వేగవంతం చేయాలి

**ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక సమావేశం**

**యాడికి జూలై 04 సంక్షేమ సాక్షి:** మండల కేంద్రంలో నిర్వహిస్తున్న 'సర్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని నాయకులు బూత్ స్థాయి ఏజెంట్లకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం బూత్ స్థాయి ఏజెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లా డుతూ, నియోజకవర్గంలో 'సర్' కార్యక్రమాన్ని సమర్థవం తంగా అమలు చేయాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో పక్కా పరిశీలన జరపాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాల వారీగా మరణించిన వ్యక్తుల ఓట్లను గుర్తించి వెంటనే జాబితా నుంచి తొలగించాలని, అలాగే అర్హులైన కొత్త ఓటర్లను గుర్తించి వారి పేర్లను ఓటరు జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో బూత్ స్థాయి ఏజెంట్లు బాధ్యతాయుతంగా పనిచేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా కృషి చేసి, 'సర్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ ఆదినారాయణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రుద్రమ నాయుడు, క్లస్టర్-4 ఇంచార్జ్ మాయకుంట నారాయణస్వామి, బూత్ స్థాయి ఏజెంట్లు నరసింహ చౌదరి, దయ్యాలమడుగు సుబ్బారెడ్డి, హాజీ పీర్, రామచంద్రరాజు, నారాయణరెడ్డి, ఆదినారాయణ, వంకం రాజు, దివి చంద్ర, ఖాదర్ వలీ తదితరులు పాల్గొన్నారు.



# కోయ ఎయిడెడ్ పాఠశాలలకు రూ.75 వేల విరాళం

**బల్లలు, బెంచీల కొనుగోలుకు కంబాల శ్రీనివాసరావు సాయం**

**తూర్పుగోదావరి/ గోకవరం జూలై 04సంక్షేమ సాక్షి:** తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయంలో శనివారం పాఠశాల సిబ్బందికి చెక్కును అందజేశారు. చిన్న రమణయ్యపేట, కమ లం పాలెం, కే.వీరవరం, గుబ్బలపాలెం గ్రామాల కోయ ఎయిడెడ్ పాఠశాలల్లో బల్లలు, బెంచీల కొనుగోలు కోసం విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గ బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు రూ.75 వేల విరాళాన్ని అందించారు. గిరిజన ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు తన వంతు సహకారం ఎప్పటికీ కొనసాగుతుందని కంబాల శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి స్పందించి విరాళం అందించిన ఆయనకు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



# జొన్నాడలో పాసు పుస్తకాల పంపిణీ

**పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

**కోనసీమ/ఆలమూరు జూలై 04 సంక్షేమ సాక్షి:** కూటమి ప్రభుత్వంలో రాజముద్రతో కూడిన, తప్పులు లేని పాసు పుస్తకాలు రైతులకు అందజేస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. జొన్నాడలో జరిగిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రిజిస్ట్రేషన్ లకు గానీ, లోన్లకు గానీ పట్టాదారు పాసుపుస్తకాలు రైతాంగానికి కీలకమైనవన్నారు. వైసీపీ హయంలో రైతులు అనేక ఇక్కట్లకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్ల అంశంలో, ఎరువుల విషయంలో అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. అప్పట్లో రకరకాల తప్పులతో, జగన్ తన సొంత ఫోటోలతో పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అవి ఎందుకు పనికి వచ్చేవి కాదన్నారు. ఎన్డీఏ కూటమి ఈ అంశాన్ని గమనించి,రైతుల ఆందోళనను అర్థం చేసుకొని పాత వాటిని రద్దు చేసి రాజమద్ర తో కూడిన పాస్ పుస్తకాలను అందిస్తుందన్నారు. జొన్నాడ లో 3028 ఎకరాల భూమి ఉందన్నారు. భూమి హక్కుదారులు ( ఎల్పీఎంలు)2036 మంది ఉన్నారన్నారు. 1628 మందికి పాసు పుస్తకాలు





ప్రింట్ చేసి అప్పగిస్తున్నామన్నారు. ఈ 1628 రికార్డులు పూర్తిగా ఎటువంటి తప్పులు లేకుండా, సరిచేసి అందించడం జరిగిందన్నారు. గతంలో దొర్లిన తప్పులు అన్నీ సరిచేసి రైతుల దగ్గర ఒక్క పైసా కూడా తీసుకోకుండా ఈ పాస్ పుస్తకాలు అందించడం జరిగిందన్నారు. రీ సర్వే పేరుతో జరిగిన తప్పులే కాకుండా అప్పట్లో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చి రైతులను ఇబ్బందులు పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ చట్టాన్ని రద్దు చేయడం జరిగిందన్నారు. గతంలో పాస్ పుస్తకాల్లో దొరికిన తప్పులను ఎక్కడ సరి చేసుకోవాలో తెలిసేది కాదని, ఇప్పుడు ఆర్డీవోలకు, తాసిల్దార్లకు అధికారాన్ని కట్టబెట్టి ప్రభుత్వం రైతులకు మేలు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ సాక్షి
తెలుగు దిన పత్రిక



### రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కి అప్లికేషన్ అందజేసిన

### ముసునూరు మండల జనసేన పార్టీ నాయకులు

# ఎమ్ సత్తిబాబు


**నూజివీడు జులై 04 సంక్షేమ సాక్షి :** రాజనగరం ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ కి అప్లికేషన్ అందజేసిన ముసునూరు మండలం జనసేన పార్టీ నాయకులు ఎమ్ సత్తిబాబు. ఈరోజుతో ముగియనున్న జనసేన పార్టీ పదవులకు అప్లికేషన్ గడువు అందరికి నమస్కారం నూజివీడు నియోజకవర్గం నాలుగు మండలాలు, పట్టణ, గ్రామ వార్డుల జనసేన పార్టీ జన సైనికులకు వీర మహిళలకు జనసేన పార్టీ నాయకులకు కార్యకర్తలకు నమస్కారం జనసేన పార్టీ నిర్మాణంలో భాగంగా జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీని నియమించడం జరిగింది. అందులో భాగంగా ఏలూరు పార్లమెంటుకు రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణని పరిశీలకులుగా నియమించడం జరిగింది. అందులో భాగంగా వివిధ హోదాల పార్టీ పదవులకు అప్లికేషన్ పెట్టుకోవడానికి రేపు చివరి రోజు అనగా 2026 జులై 5 వ తేదీన ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో సమాచార దరఖాస్తు స్వీకరణ కార్యక్రమం జరుగుతుంది. కావున నూజివీడు నియోజకవర్గం లో మండల,పట్టణ, గ్రామ పంచాయతీ పదవుల కోసం జనసేన పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి పార్టీ బలోపేదానికి జనసేన నాయకులు కార్యకర్తలు జనసైనికులు వీర మహిళలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని తగిన పదవులకు దరఖాస్తు చేసుకొని క్షేత్రస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు జనసేన పార్టీ బలమైన నిర్మాణంలో భాగం కావాలని కోరుకుంటున్నాము.



## వంగవీటి మోహన్ రంగా ఆశయ సాధనకు కృషి చేయాలి

-ఎమ్మెల్యే సుజన చౌదరి

**విజయవాడ జులై 0 4 సంక్షేమ సాక్షి:** మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్ రంగా 79 జయంతి వేడుకలు పశ్చిమ నియోజకవర్గం , విద్యాధరపురం వీ ఎం రంగా జంక్షన్ వద్ద ఘనంగా నిర్వహించారు. మోహనరంగా విగ్రహ ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో మైలవరపు దుర్గారావు మైలవరపు కృష్ణ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ జయంతి వేడుకలలో మాజీ కేంద్ర మంత్రి వర్యులు విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలిసత్యనారాయణ చౌదరి ( సుజనా చౌదరి) పాల్గొని మోహన్ రంగా విగ్రహానికి పూలమాలు వేసి ఘన నివాళులు అర్పించారు పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహానీయుడు రంగా అని కొనియాడారు మోహనరంగా ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సుజన పిలుపునిచ్చారు.ఈ వేడుకల్లో ఏపీ పొల్యూషన్ బోర్డ్ మెంబర్ పంచకర్ల సందీప్, నూర్ భాషా కార్పొరేషన్ చైర్మన్ కె.నాగుల్ మీరా, కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.ఎస్. బేగ్, జనసేన రాష్ట్ర నాయకులు అమ్మిశెట్టి వాసు తదితరులు రంగా విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత గునుకుల పుల్లయ్య, మిరియాల వెంకటేశ్వరరావు, సుంకర కృష్ణ, మాజీ కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, మహదేవు అప్పాజీరావు, మరుపిళ్ల రాజేష్, ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), గుడివాడ నరేంద్ర రాఘవ, పత్తి నాగేశ్వరావు జనసేన సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్, జనసేన రాష్ట్ర నాయకులు పెనుగొండ సుబ్బారాయుడు, లింగం శివప్రసాద్, కె.యస్.ఎన్, మూర్తి,అక్కల గాంధీ, ఏలూరు శరత్, పేటేటి నాంచారయ్య, బావిశెట్టి, శ్రీనివాస్,బొమ్ము గోవిందమ్మ సంభన బాబురావు, గంధం అంజిబాబు గన్ను శంకర్,తమ్మిన లీలాకుమార్,తో పాటు పెద్ద సంఖ్యలో రంగా అభిమానులు పాల్గొన్నారు.



## చదువుల యువరాజుకు పట్టాభిషేకం

**శ్రీకాళహస్తి జూలై 04 సంక్షేమ సాక్షి:** బీపీ అగ్రహారం నందు సాధారణమైన మధ్య తరగతి కుటుంబంలో పుట్టి ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్రస్థాయి లో రెండవ ర్యాంకు సాధించినటువంటి సి ఎ హర్షవర్ధన్ ను ఘనంగా శ్రీకాళహస్తి కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలప దామోదర్ రెడ్డి సన్మానించారు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ చదువుకున్న విద్యాసంస్థలకు మరియు కుటుంబానికి మంచి పేరు తీసుకొచ్చినటువంటి హర్షవర్ధన్ ను ఆదర్శంగా తీసుకోవాలని, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థులు నిరంతరం భవిష్యత్తుపై కాంక్షతో చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సుజన చౌదరి

**విజయవాడ జులై 04 సంక్షేమ సాక్షి:** పశ్చిమ నియోజకవర్గ పరిధిలో రూ7 కోట్లతో చేపడుతున్న స్టామ్ వాటర్ డ్రైనేజీలు, మరియు రూ 1 కోటి 20 లక్షలతో ప్రారంభించిన బాక్స్ కల్వర్టుల నూతన నిర్మాణాలను ఎమ్మెల్యే సుజన చౌదరి కూటమి నేతలతోకలిసి పరిశీలించారు. ఐరన్ యార్డ్, బైపాస్ రోడ్డు, చర్చ్ సెంటర్ లో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిని వీ ఎం సీ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఇప్పటికే పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా ఇన్సెంటివ్ ఫండ్స్ రూ 7 కోట్లతో ఐరన్ యార్డ్ , బైపాస్ రోడ్డు, పార్థసారధి రోడ్డు, పంజా సెంటర్ లో స్టామ్ వాటర్ డ్రైనేజీల నిర్మాణ పనులు , విఎంసి జనరల్ ఫండ్స్ రూ 1 కోటి 20 లక్షలతో బాక్స్ కల్వర్టులనుప్రారంభించామని తెలిపారు.నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలను పాటించి నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని ఈ ఈ శ్రీనివాస్ కు తెలిపారు.పశ్చిమ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు.



# ఏలూరులో జనసేన దరఖాస్తుల స్వీకరణకు విశేష స్పందన

### రేపటితో ముగియనున్న సమాచార సేకరణ కార్యక్రమం...పార్టీ బలోపేతానికి సంస్థాగత నిర్మాణమే పునాది: ఎమ్మెల్యే బత్తుల

**తూర్పుగోదావరి /రాజానగరం జులై 04సంక్షేమ సాక్షి:** జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ఏలూరు నియోజకవర్గంలో విశేష స్పందన లభిస్తున్నట్లు రాజానగరం ఎమ్మెల్యే, ఏలూరు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బలరామకృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమం రేపటితో ముగియనున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, జనసైనికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పార్టీ కమిటీల్లో బాధ్యతలు చేపట్టి పనిచేయడానికి ఆసక్తి ఉన్న నాయకులు, కార్యకర్తల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఏలూరు నియోజకవర్గంలో ఉదయం నుంచి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నేతృత్వంలోని 28 మంది సభ్యుల బృందం దరఖాస్తులను స్వీకరిస్తోందన్నారు.పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దరఖాస్తుల ద్వారా సేకరించిన వివరాలను పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకున్న ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.






### వాసవ్య మహిళా మండలి సంస్థ ఆధ్వర్యంలో

## ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు శిక్షణ

**చిలమత్తూరు జూలై 0 4సంక్షేమ సాక్షి :** పాఠశాల లొ చదువు తున్న విద్యార్థి లు ఆర్థికం గా లేక అవగాహన లేక మధ్యలో చదువు వదలకుండా ఉండెలా చర్యలు తీసుకోవాలని మండలం లొ నీ ఉపాధ్యాయని ఉపాధ్యాయులు కూ వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లొ భాగంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత మాట్లాడుతూ వాసవ్య మహిళా మండలి సంస్థ గురించి మరియు ప్రాజెక్ట్ యొక్క యాక్టివిటీస్ ను వివరించటం జరిగింది..ఇందులో భాగంగా డ్రపౌట్ ( పాఠశాల ను మధ్యలో వదిలిన )తిరిగి స్కూల్ కి వచ్చేలా చెయ్యాలనీతెలిపారు..మరియు ఎమ్. ఇ. ఓ హనుమశీత్ రెడ్డి. మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు గురించి మరియు వాసవ్య మహిళా మండలి సంస్థ కు ఎల్లప్పుడు మా సహకారం అందిస్తాం అని తెలియజేయటం జరిగింది.. అదేవిధంగా ఎమ్. ఇ. ఓ సల్మాన్ రాజ్ మాట్లాడుతూ టీచర్స్ పిల్లలతో సోషల్ ఎమోషనల్ కనెక్టివిటీనీ పెంచుకోవాలని అప్పుడే పిల్లలు అన్ని మనతో పంచుకోవడం జరుగుతుందని.. మరియు స్కూల్లలో కూడా పిల్లలు మద్యం, డ్రగ్స్ వంటి వాటిని వాడుతున్నారు.. మనం ఈ సమస్యలని కొంతైనా తగ్గించాల్సినా బాధ్యత మనకు ఉంది.. అలాగే దేమకేతే పల్లి జడ్. పి. హెచ్. ఎస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ వాసవ్య మహిళా మండలి సంస్థ చేస్తున్న పనిని క్లుప్తంగా వివరించారు.. అదేవిధంగా స్కూల్ విద్యార్థుల యొక్క రియల్ సక్సెస్ స్టోరీను వివరించటం జరిగింది.. చిలమత్తూరు మండలం స్కూల్ టీచర్స్ వారి అనుభవాలను వివరించటం జరిగింది. ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తికావటం జరిగింది.ఇందులో భాగంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత , యం. ఇ. ఓ లు హనుమంత్ రెడ్డి , సల్మాన్ రాజ్,ప్రాజెక్ట్ సిబ్బంది, స్కూల్ టీచర్స్,హారాలు కావటం జరిగింది.



### ఘనంగా వంగవీటి మోహన రంగా

## జయంతి వేడుకలు

**తాళ్లపూడి జూలై 04 సంక్షేమ సాక్షి :** మండలపరిధిలో ని పెద్దేవం గ్రామంలోని వంగవీటి జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాపు సంఘ నాయకులు మాట్లాడుతూ వేడుకలు పేద ప్రజల గుండెచప్పుడు నవ యువ సమాజ మార్గదర్శి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రజా సేవకుడు రంగా అని కొనియాడారు. పేద ప్రజల ఇళ్ల పట్టాల కోసం ప్రజా పోరాటం చేస్తూ తన ప్రాణాలను అర్పించిన మహా నాయకుడు అని అన్నారు. ఆయన మన మధ్య లేకపోయినా జనం గుండెల్లో స్థిరస్థాయిగా జీవించే ఉన్నారన్నారు. రంగా ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు నామన చిన్న బురయ్య, ముప్పన పల్లి వీరబాబు, కల్లూరి సుబ్రహ్మణ్యం, బోడపాటి కాశీ, గెడ్డం గాంధీ, సిద్దంశెట్టి స్వామి, ముప్పనపల్లి మని రాంబాబు,కోడి పవన్, నరాలశెట్టి వీరబాబు, గంగాధర, కేశవరపు హేమంత్, ముప్పన పల్లి కల్కి మరియు రంగా యూత్ మరియు యువకులు పాల్గొన్నారు.



## జిల్లా పర్యటనకు హోంమంత్రి అనిత రాక

### ఎస్పీ నరసింహ కిషోర్ మర్యాదపూర్వక భేటీ

**రాజమహేంద్రవరం జూలై 04 సంక్షేమ సాక్షి:** తూర్పుగోదావరి జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనితకు అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా శాంతిభద్రతల అంశాలపై సంక్షిప్తంగా చర్చించినట్లు అధికారులు తెలిపారు.



### తొట్టంబేడు మండల వైస్ ఎంపీపీని

## పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**శ్రీకాళహస్తి జూలై 04 సంక్షేమ సాక్షి:** నియోజకవర్గం లోని తొట్టంబేడు మండలం, కొత్త కండ్రిగ గ్రామానికి చెందిన తొట్టంబేడు మండల వైస్ ఎంపీపీ మరియు వైకాపా నాయకులు



పెద్దసరి గెరాట రెడ్డి ఇటీవల గా2 కు సంబంధించిన సర్జరీ జరిగి డిశ్చార్జ్ అయ్యి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు.విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి అడిగి తెలుసుకుని వాళ్ళ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఇందులో కొత్త కండ్రిగ గ్రామానికి చెందిన వైకాపా నాయకులు పెద్దసరి రామ చంద్ర రెడ్డి, నరసింహ రెడ్డి, భాస్కర్ రెడ్డి, చంద్ర రెడ్డి వీరా స్వామి రెడ్డి, మంగా రెడ్డి, వెంకటేసులు రెడ్డి,, పాపయ్య, దొర రాజ రెడ్డి, హరి కృష్ణ రెడ్డి, గెరాట రెడ్డి, సురేంద్ర, లోకేష్, యుగంధర్ మరియు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల ప్రెసిడెంట్ డా.కోగిల సుబ్రహ్మణ్యం,కాపిరెడ్డి ఢిల్లీ బాబు రెడ్డి, తొట్టంబేడు మాజీ పిఎసిఎస్ చైర్మన్ మణి నాయుడు, కోవి చంద్రయ్య నాయుడు,కాపులూరి వెంకీ, సుబ్బరాయులు, గంగాధరం, దీపక్ రెడ్డి, పెంచులయ్యా తదితరులు ఉన్నారు.



### వంగవీటి మోహన్ జయంతి వేడుకలలో పాల్గొన్న...

# అంజూరు తారక శ్రీనివాసులు

**శ్రీకాళహస్తి జూలై 04 సంక్షేమ సాక్షి:** పట్టణం లో వంగవీటి మోహన రంగా సర్కిల్ వద్ద శ్రీకాళహస్తి బలిజ నాయకుడు వంగవీటి మోహన్ రంగా జయంతి వేడుకలు నిర్వహించారు .ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.వంగవీటి మోహన్ రంగా కి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాలాభిషేకం కేక్ కట్ నిర్వహించారు.ఈ సందర్భంగా అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ “79వ జయంతి సందర్భంగా శ్రీకాళహస్తిలోని వంగవీటి మోహన రంగ సర్కిల్లో రంగా విగ్రహం ముందు వారికి పాలాభిషేకం, పుష్పాభిషేకం చేసిన తర్వాత కేక్ కటింగ్ చేయడం జరిగింది. మోహన రంగా యొక్క అభిమానులు అన్ని కులాల్లోనూ ఉంటారు. ఆయన ఒక కార్మిక నేతగా ప్రారంభించిన జీవితం అంచలంచలుగా బీబీసీ న్యూస్లో ఫస్ట్ టైమ్ ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంత పెద్ద స్థాయిలో అలజడి జరుగుతోందనే ఒక న్యూస్ వైరల్ అయ్యే స్థాయికి ఎదిగినారు.ఆయన మరణం అందరికీ తీరని దుఃఖాన్ని, ఇబ్బందికరమైన వాతావరణాన్ని ఇచ్చినప్పుడు అన్ని వర్గాల ప్రజలందరూ కూడా అట్టడుగుపోయి ఈ రాష్ట్రంలో విధ్వంసం ఏ విధంగా ఉంటుంది, మనసు చలించిపోతే ఏ విధంగా ఉంటుంది అనేది సామాన్య మానవుడిలో నుంచి, సామాన్య వ్యక్తుల హృదయం లో నుంచి వచ్చిన ఆవేదన వల్ల బీబీసీ న్యూస్కు కూడా రావాల్సి వచ్చింది.అదే వంగవీటి మోహన రంగా గారు ఈ రోజుల్లో ఉండుంటే ఆయన ఖచ్చితంగా ఈ రాష్ట్రానికి మంత్రి కాదు ముఖ్యమంత్రి కూడా అయి ఉంటాడు అని తెలిపారు.ఎందుచేత అంటే ఆయన ఒక కులానికి పరిమితం కాకుండా అన్ని కులాల్లో కూడా అతనికంటూ ఒక ప్రత్యేకమైన అభిమానాన్ని సంపాదించుకున్నాడు. అటువంటి అద్భుతమైన నాయకత్వం మనకు మన కులంలో పుట్టడం, ఆ నాయకత్వాన్ని మనం చూడడం వారి యొక్క ఆశయాలకు అనుగుణంగా మనమందరం కూడా పని చేయాలని తెలిపారు. మనం నేర్చుకోవాల్సింది కూడా ఏంటంటే అన్ని కులాలతో మనం ఉండాలి, అన్ని కులాల వారికి మనకు చేతనైన సహాయం చేయాలి, అన్ని కులాల్లో కూడా మనం మమేకం అవ్వాలని చెప్పి ఆయన ఇచ్చిన సందేశాన్ని మనమందరం కూడా పాటించాలని తెలిపారు.ఈ కార్యక్రమానికి అతిథులుగా , అంజూరు వెంకటేష్ బాబు, తంబు శెట్టి నరేంద్ర, చిలుకా గోపి, పగడాల రాజు, సురా సురేష్, పత్తి మనీ, చింతామణి పాండు, కంటా ఉదయ్ కుమార్, సూర సురేష్, సాధన మున్నా రాయల్,దుమ్ము రాయల్, చక్రాల మురళి, వల్లం గోపి, మగరాల గణేష్, ఉదయగిరి తేజు రాయల్, అంజూరు వెంకీ రాయల్,ప్రసాద్, వేణు, మురళితదితరులు పాల్గొన్నారు.





### జ్ఞానమ్మ కండ్రిగ ST కాలనీ సందర్శన...

## ప్రజల సమస్యలను గుర్తించిన నరేంద్ర దండి

**ప్రతి అర్హుడికి ఆధార్ - ప్రతి పౌరుడికి ఓటు హక్కు అందే వరకు మా కృషి నిరంతరం**

**కోటయ్య కృషికి అభినందించిన జనసేన నాయకులు, దండి నరేంద్ర**

**శ్రీకాళహస్తి జూలై 04 సంక్షేమ సాక్షి:** ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని జ్ఞానమ్మ కండ్రిగ



ఎస్టీ కాలనీని సందర్శించి స్థానిక ప్రజల సమస్యలను జనసేన యువ నాయకుడు నరేంద్ర దండి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా, పలువురు గిరిజనులకు ఇప్పటికీ ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ లేకపోవడం, మరికొందరికి ఆధార్ ఉన్నప్పటికీ ఓటర్ ఐడీ లేకపోవడం వంటి అత్యంత ప్రాథమిక సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి తన ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ అంశంపై సంబంధిత బసవయ్యపాలెం వీఆర్వో రవి తో చర్చించగా, ఆయన సానుకూలంగా స్పందించి ఆధార్ కలిగిన అర్హులందరికీ వెంటనే ఓటర్ ఐడీ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తామని, అలాగే ఆధార్ లేని వారికి ముందుగా ఆధార్ నమోదు పూర్తి చేసి, అనంతరం ఓటర్ ఐడీ ప్రక్రియ చేపడతామని హామీ ఇచ్చారు. ఈ ప్రాథమిక సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి, గిరిజనుల హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్న కోటయ్య సేవలను హృదయపూర్వకంగా అభినందించారు. ప్రజల మౌలిక హక్కులు, సంక్షేమం మరియు ప్రభుత్వ సేవలు ప్రతి అర్హుడికి చేరేలా జనసేన పార్టీ తరఫున తన కృషి నిరంతరం కొనసాగుతుందని నరేంద్ర దండి తెలియజేశారు.

### ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే

## చర్యలు తప్పవు

**డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరి.. ప్రత్యేక తనిఖీల్లో సీఐ ప్రసాద్‌రావు హెచ్చరిక**

**పులివెందుల జూలై 04 సంక్షేమ సాక్షి:** పట్టణంలో ట్రాఫిక్ నిబంధనల అమలుపై పోలీసులు దృష్టి సారించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, ట్రాఫిక్



నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని పులివెందుల సీఐ ప్రసాద్‌రావు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పులంగళ్ల సర్కిల్‌లో పోలీసు సిబ్బందితో కలిసి ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, బీమా, ఇతర వాహన పత్రాలతో పాటు హెల్మెట్ వినియోగాన్ని పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. సీఐ ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఇంటి నుంచి వాహనంపై బయలుదేరే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అవసరమైన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, అది చట్టపరమైన నిబంధన మాత్రమే కాకుండా ప్రాణరక్షణకు అత్యంత కీలకమని అన్నారు. మైనర్ బాలలకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, అలాంటి ఘటనలు వెలుగులోకి వస్తే తల్లిదండ్రులపైనా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

### వంగవీటి మోహన రంగ ఆశయాలు

## నేటి తరానికి ఆదర్శం: నరేంద్ర దండి

**శ్రీకాళహస్తి జూన్ 04 సంక్షేమ సాక్షి:** రాధా రంగ మిత్ర మండలి జిల్లా అధ్యక్షులు బొక్కిసం మునిసుబ్బయ్య ప్రత్యేక ఆహ్వానం మేరకు, బడుగు, బలహీన వర్గాల



ఆశాజ్యోతి, ప్రజాహృదయ నాయకుడు వంగవీటి మోహన రంగ జయంతి వేడుకల్లో పాల్గొనడం నాకు ఎంతో గౌరవంగా భావిస్తున్నాను. ఈ సందర్భంగా నరేంద్ర దండి మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం వంగవీటి మోహన రంగ జీవితాంతం పోరాడారని కొనియాడారు. కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా ప్రజల విశ్వాసాన్ని, అపారమైన అభిమానాన్ని సంపాదించి, తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన అరుదైన ప్రజానాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పగడాల సుధాకర్, పగడాల ప్రతాప్, కవితా రాణి, పూల కృష్ణయ్య,కోల వెంకటేశ్వర్లు, కె.వి. రమణ, కె. ప్రసాద్, పనపాటి కృష్ణ, ప్రదీప్, అలాగే పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు అందరికీ నరేంద్ర దండి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

### కన్నలి భాస్కర్ రెడ్డిని..

## పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**శ్రీకాళహస్తి జూలై 04 సంక్షేమ సాక్షి:** శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం, పెద్ద కన్నలి గ్రామానికి చెందిన వైకాపా సీనియర్ నాయకులు కన్నలి భాస్కర్ రెడ్డి ఇటీవల



అనారోగ్యం నుంచి కోల్కొని ప్రస్తుతం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి మాజీ మీరా బియ్యపు మధుసూదన్ రెడ్డి వారి నివాసానికి స్వయంగా వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల ప్రెసిడెంట్ డా.కోగిల సుబ్రహ్మణ్యం,కాపిరెడ్డి ఢిల్లీ బాబురెడ్డి,తొట్టంబేడు మాజీ PACS చైర్మన్ మణి నాయుడు, కోవి చంద్రయ్య నాయుడు,గంగాధరం, దీపక్‌రెడ్డి,పెంచులయ్యా తదితరులు పాల్గొన్నారు.

## సీఎం బాబు సంక్షేమం...శరణార్థులకు అండ..!అధ్యక్షుడు బెల్లంకొండ మురళి

**భాకరాపేట కిడ్నీ బాధితుడు మస్తానయ్యకు పదివేలు పింఛన్ పంపిణీ**

**చిన్నగొట్టిగల్లు జూలై 04 సంక్షేమ సాక్షి** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కోసం అర్థించే అర్హులైన శరణార్థులకు కూటమి ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తుందని టిడిపి చిన్నగొట్టిగల్లు మండలాధ్యక్షుడు బెల్లంకొండ మురళి పేర్కొన్నారు. భాకరాపేటకు చెందిన మస్తానయ్య గత కొంత కాలంగా కిడ్నీ సమస్యలతో బాధపడుతూ ప్రభుత్వ సంక్షేమ పింఛన్ తో ఆదుకోవాలని ఎమ్మెల్యే పులివర్తి నానిని కోరడం తో వెంటనే పదివేల రూపాయల పింఛను మంజూరు చేశారు. శనివారం టిడిపి మండలాధ్యక్షుడు బెల్లంకొండ మురళి పార్టీ శ్రేణులతో కలిసి పదివేల రూపాయల ప్రభుత్వ పింఛను కిడ్నీ బాధితుడైన మస్తానయ్యకు అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బెల్లంకొండ మురళి మాట్లాడుతూ ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లతో అవ్వా తాతలు, వితంతువులు, అనారోగ్యం పాలైన బాధితులకు కొండంత భరోసా నిస్తున్నాయన్నారు. చంద్రగిరి



చరిత్రలో ఏ ఎమ్మెల్యే కి కూడా సాధ్యం కానీ రీతిలో సంక్షేమ పథకాలను అందిం చడంతో పాటు మరోవైపు ఎంతోమంది నిరశ్రాయులకు సీఎం సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందించిన ఘనత ఎమ్మెల్యే పులివర్తి నానికే దక్కుతుందన్నారు. ప్రజల ఆశీస్సులే కూటమి ప్రభుత్వానికి కొండంత అండని అన్నారు. లబ్ధిదారుడు మస్తానయ్య మాట్లాడుతూ గత కొంతకాలంగా కిడ్నీ సమస్యలతో అనారోగ్యం పాలైన తనకు తన కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లోకి తీసుకెళ్లిందన్నారు. అప్పులు బాధలతో దిక్కుతోచలేని స్థితిలో ఉన్న మాకు ఎమ్మెల్యే పులివర్తి నాని అందించిన ఈ ప్రభుత్వ సంక్షేమం మా కుటుంబానికి కొండంత ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని చేసిన ఈ మేలును ఎప్పటికీ మరువలేమంటూ ఆయనకు తమ కుంటుంబ సభ్యులందరూ రుణపడి ఉంటామన్నారు. కూటమి నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ సెక్రెటరీ రామ్మోహన్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటరత్నం మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన అభివృద్ధికి కృషి చేస్తా: నీలిరతయ్య

**సీతారామపురం జులై 04 సంక్షేమ సాక్షి:** మండలంలో జనసేన పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని జనసేన నాయకుడు, సాగునీటి సంఘం చైర్మన్ నీలిరత్తయ్య పేర్కొన్నారు.



పార్లమెంటు నియోజకవర్గాల వారీగా నెల్లూరులో జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నా సేన కోసం నా వంతు కోఆర్డినేటర్, ఉదయగిరి నియోజకవర్గ జనసేన నాయకుడు భోగినేని కాశీరావు ఆధ్వర్యంలో పాల్గొన్నారు. గ్రామస్థాయిలోని పార్టీ స్థితి గతులను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. జనసేన పార్టీ నియమించిన పరిశీలకులకు దరఖాస్తును అందజేశారు.

### కూటమి ప్రభుత్వ హయాంలో...

## గ్రామాభివృద్ధికి ఊపు

**పందిపాడులో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం: లక్ష్మన్న యాదవ్**

**కర్నూలు జూలై0 4 సంక్షేమ సాక్షి:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా అమలవుతున్నాయని



కల్లూరు సొసైటీ డైరెక్టర్ లక్ష్మన్న యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పందిపాడు గ్రామంలో కొన్నేళ్లుగా నీటి సరఫరా సమయంలో ఎదురవుతున్న విద్యుత్ సమస్యను గుర్తించి ఎమ్మెల్యే గౌరు చరిత దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయడంతో ప్రత్యేక విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్, మోటార్ల ఏర్పాటుతో ఏళ్ల తరబడి ఉన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. అదేవిధంగా పందిపాడు గ్రామ అభివృద్ధి కోసం రూ.1 కోటి నిధులు మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే గౌరు చరితకే దక్కుతుందని ఆయన అన్నారు. సొసైటీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా ప్రణాళికలు రూపొందించి, రుణాల మంజూరు, వసూళ్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపడంతో మరింత మంది రైతులకు రుణ సౌకర్యాలు కల్పించే అవకాశం ఏర్పడిందని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టాదారు పాసు పుస్తకాలపై, భూ హద్దు రాళ్లపై వ్యక్తుల పేర్లతో ప్రచారం నిర్వహించడాన్ని ప్రజలు వ్యతిరేకించారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ప్రతి రైతు భూమికి సంబంధించిన హద్దులు, పూర్తి వివరాలు, క్యూ.ఆర్. కోడ్‌తో పాటు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను అందించి రైతుల విశ్వాసాన్ని చూరగొందని తెలిపారు. అలాగే బాంబే--సూరత్ జాతీయ రహదారి తమ ప్రాంతానికి సమీపంలో ఉండడం వల్ల రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడ్డాయని లక్ష్మన్న యాదవ్ వెల్లడించారు.

## అల్లూరి సీతారామరాజు జన్మదిన వేడుకలు

**సీతారామపురం జులై 04 సంక్షేమ సాక్షి:** భారత స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు మండల ప్రజా పరిషత్



కార్యాలయం లో ఎంపీడీవో జి .చిన్న చెన్నారావు ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అల్లూరి సీతారామరాజు చేసిన సేవలను స్మరించుకుంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయాల ఏవో చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

### ఓటరు హక్కు పరిరక్షణకు ఎస్ఐఆర్ ప్రక్రియపై

## అవగాహన అవసరం

**మావటూరులో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్**

**పెనుకొండ జూలై 04 సంక్షేమ సాక్షి:** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మావటూరులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాజీ



మంత్రి,శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని తమ ఓటరు వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఓటరు తమ హక్కును పరిరక్షించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. అలాగే, ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు మరియు ఇతర వివరాలను పరిశీలించి, అవసరమైతే సవరణలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారుఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### రెండు కార్లలో 120 కేజీల...

## గంజాయి పట్టివేత

**నలుగురు మహారాష్ట్ర యువకుల అరెస్టు**

**రూ.10 లక్షల విలువైన గంజాయి స్వాధీనం**

**తూర్పుగోదావరి/ రాజానగరం జూలై04సంక్షేమ సాక్షి:** పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కార్లలో అక్రమంగా 120 కిలోల గంజాయిని తరలిస్తుండగా పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఈ ఘటనలో మహారాష్ట్రకు చెందిన నలుగురు యువకులను అరెస్టు చేసి రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రాజానగరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ వెల్లడించారు. మహారాష్ట్ర రాష్ట్రం, థానే జిల్లా, పింప్లాస్ ప్రాంతానికి చెందిన పేట్రియాట్స్ మిత్ ప్రదీప్, ప్రటియాస్ సుందర్ బారుడే, ఆదిత్య అరవింద్, నిఖిల్ మధుకర్ పాటిల్ ఇద్దరు కార్లలో గోకవరం నుంచి మహారాష్ట్రలోని పూణే వైపు గంజాయిని





తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. దీంతో కొంతమూరు సమీపంలోని దినేష్ దాబా వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించగా, రెండు కార్లలో తరలిస్తున్న 120 కిలోల గంజాయి పట్టుబడిందని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, 120 కిలోల గంజాయి, రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు, రూ.1,770 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని వివరించారు. నిందితులను గుర్తించి అరెస్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన ఎస్ఐ ఎస్. ప్రియకుమార్‌తో పాటు ఈగల్ బృందం సిబ్బందిని సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ అభినందించారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

## రోడ్డు అంటే రేసింగ్ ట్రాక్ కాదు..!

**ప్రాణాలు కాపాడుకోవాలంటే ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే - ఎస్ఐ. మధుసూదన్‌రావు**

**వరికుంటపాడు జూలై 04 సంక్షేమ సాక్షి :** మండలం లోని జడదేవి గ్రామపంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి–565పై శనివారం ప్రత్యేక రహదారి భద్రత అవగాహన కార్యక్రమాన్ని వరికుంటపాడు సబ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, వాహనదారులను ఉద్దేశించి మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడమేనని తెలిపారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ ధరించాలని, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపకూడదని, అతివేగానికి దూరంగా ఉండాలని, ఓవర్‌టేక్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని



అవగాహన కల్పించారు. రాత్రి వేళల్లో వాహనాల లైట్లు సక్రమంగా ఉపయోగించాలని, అలసటతో లేదా నిద్రమత్తులో డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. జాతీయ రహదారిపై పాదచారులు అప్రమత్తంగా రోడ్డు దాటాలని, పిల్లలను ఒంటరిగా రహదారిపై వదిలివేయవద్దని, వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, బీమా తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత అనేది పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత కూడా అని ఎస్ఐ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారితీస్తుందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరిస్తేనే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. గ్రామస్తులు కూడా రహదారి భద్రతా నియమాలను పాటిస్తూ, ఇతరులకు అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, వాహనదారులు పాల్గొన్నారు.

సంక్షేమ సాక్షి
తెలుగు దిన పత్రిక
ఆదివారం 05 జూలై, 2026

## నదుల పరివాహక ప్రాంతాలు
# పరిశుభ్రంగా ఉంచాలి

**నదీ తీరాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంచాలి**

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

**సంక్షేమ సాక్షి కర్నూలు** : నగర పరిధిలోని నదుల పరివాహక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. శనివారం ఆయన సంకల్‌బాగ్ వద్ద తుంగభద్ర నది, రాజ్ విహార్ వద్ద హంద్రీ నది, వినాయక ఘాట్ నుంచి జొహరపురం వరకు కే.సీ. కెనాల్ ఉపనది పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతిరోజూ వాకింగ్‌కు వచ్చే ప్రజలకు నదుల పరివాహక ప్రాంతాలు ఆహ్లాదకరంగా ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నదీ తీరాల్లో చెత్త వేయకుండా పరిసర ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇంటింటి చెత్త సేకరణలో ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే సరిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సంకల్‌బాగ్‌లోని మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.






## ఓటరు జాబితా ప్రక్షాళనలో
# 'ఎస్ఐఆర్' కీలక దశ

**జులై 14 వరకు యంత్రాంగం క్షేత్రస్థాయిలోనే ఉండాలి**

**ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు చివరి వరకు వేచి చూడొద్దు**

**కర్నూలు ఈఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు**

**సంక్షేమ సాక్షి కర్నూలు** : కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఓటరు జాబితా ప్రక్షాళనలో కీలక దశ అని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్వో), నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శనివారం ఆయన కుమ్మరిగేరి (218, 226), ఛత్రిబాగ్ (215), రాంబొట్ల గుడి (233, 237), అశోక్‌నగర్ (28, 29) పోలింగ్ బూత్‌ల పరిధిలో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం బీఎల్‌వోలు, సూపర్వైజర్లు, అదనపు ఏఈఆర్వోలు, ఏఈఆర్వోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు విధులు కేటాయించిన యంత్రాంగమంతా క్షేత్రస్థాయిలోనే ఉండాలని, అత్యల్ప పురోగతి నమోదైన పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. జులై 14తో ఎన్యూమరేషన్ దశ ముగియనున్న నేపథ్యంలో ఓటర్లు చివరి వరకు వేచి ఉండకుండా తమ ఎన్యూమరేషన్ ఫారాలను త్వరితగతిన సమర్పించాలని సూచించారు. ఫారాలు అందకపోయినా, సమర్పించడంలో ఇబ్బందులు ఉన్నా లేదా ఏవైనా సందేహాలు ఉన్నా సంబంధిత బీఎల్‌వోను వెంటనే సంప్రదించాలని కోరారు. రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్ఏలు కూడా బీఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు రాజు, తిప్పన్న, నూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.






## కర్నూలు 2వ వార్డులో యస్ ఐ ఆర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై
# అవగాహన కార్యక్రమం

**సంక్షేమ సాక్షి కర్నూలు** : కర్నూలు నగరంలోని 2వ వార్డులో శనివారం యస్ ఐ ఆర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.వి. మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఓటరు జాబితా పరిశీలన, ఓటర్ల వివరాల ధృవీకరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదై ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఓటరు జాబితా ధృవీకరణ ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు (బీఎల్ఏలు), కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# పార్కుల నిర్వహణ నిబంధనలు కట్టుదిట్టం

**నగరపాలక అనుమతి లేకుండా పార్కుల నిర్వహణకు అవకాశం లేదు...కట్టడాలు, వాణిజ్య కార్యకలాపాలు, మార్పుచేర్పులు సహించం**

**పార్కుల నిర్వహణకు ఆసక్తి ఉన్న అసోసియేషన్స్ సంప్రదించాలి...నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

**సంక్షేమ సాక్షి కర్నూలు** : కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని పార్కుల నిర్వహణలో పారదర్శకత, నాణ్యత, ప్రజా ప్రయోజనాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శుక్రవారం నగరపాలక కార్యాలయంలో పార్కుల విభాగ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని పార్కులు ప్రజల విశ్రాంతి, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. అందువల్ల పార్కులను ఇష్టానుసారంగా నిర్వహించడం, వాటి స్వరూపాన్ని మార్చడం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగించడం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే పార్కుల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన అపార్ట్మెంట్ అసోసియేషన్లు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్లు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు తదితర నిర్వాహకులు తప్పనిసరిగా నగరపాలక సంస్థలో వ్రాతపూర్వకంగా దరఖాస్తు చేసి అనుమతి పొందాలని సూచించారు. అలాగే కొత్తగా పార్కుల నిర్వహణ బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తి ఉన్న సంస్థలు, సంఘాలు కూడా నగరపాలక సంస్థను సంప్రదించాలని కోరారు. పార్కుల్లో ఎలాంటి శాశ్వత లేదా తాత్కాలిక కట్టడాలు నిర్మించడం, సమావేశాలు, శుభకార్యాలు, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించడం, పార్కు స్వరూపంలో మార్పులు చేయడం, అనుమతి లేకుండా పెయింటింగ్‌లు వేయడం, మొక్కలను తొలగించడం, ప్రజల వినియోగానికి ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, వారికి అప్పగించిన పార్కుల నిర్వహణ బాధ్యతలను వెంటనే రద్దు చేస్తామని స్పష్టం చేశారు. పార్కుల నిర్వహణలో భాగస్వామ్యమయ్యే ప్రతి సంఘం నగరపాలక సంస్థ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, సంబంధిత ఒప్పందం, అనుమతులను పూర్తి చేసుకోవాలని సూచించారు. నగరంలోని ప్రతి పార్కు పరిశుభ్రంగా, పచ్చదనంతో, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి, డీఈఈ కృష్ణలత, హార్టికల్చర్ ఏడీ ప్రతాప్ రెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి..
# భావితరాలకు చిరస్మరణీయం

**ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం : జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**

**స్వేచ్ఛ, ఆత్మగౌరవం, దేశభక్తి, త్యాగం వంటి ఉన్నత విలువలకు అల్లూరి సీతారామరాజు ప్రతీక**

**దేశాభివృద్ధి, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయడమే అల్లూరి సీతారామరాజుకు అందించే నిజమైన నివాళి**


**సంక్షేమ సాక్షి కర్నూలు** : స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా నేడు జిల్లా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడని పేర్కొన్నారు. బ్రిటీష్ పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా గిరిజనులను సంఘటితం చేసి, వారి హక్కుల పరిరక్షణ కోసం అసాధారణ ధైర్యసాహసాలతో పోరాడిన గొప్ప నాయకుడిగా అల్లూరి చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. స్వేచ్ఛ, ఆత్మగౌరవం, దేశభక్తి, త్యాగం వంటి ఉన్నత విలువలకు అల్లూరి సీతారామరాజు ప్రతీక అని జాయింట్ కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగం, చూపిన అంకితభావం నేటికీ ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తోందని చెప్పారు. సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. నేటి యువత అల్లూరి సీతారామరాజు ఆశయాలను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణ, నిజాయితీ, దేశభక్తి, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం మాత్రమే కాకుండా, వారు కలలుగన్న సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధి, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయడమే అల్లూరి సీతారామరాజుకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ అధికారి సురేష్, ట్రైబల్ వెల్ఫేర్ సలహామండలి డైరెక్టర్ వెంకటపతి, గిరిజన సంఘం నాయకులు కైలాస్ నాయక్, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## కేంద్రీయ విద్యాలయాన్ని ఆకస్మిక
# తనిఖీ చేసిన ఎంపీ బస్తిపాటి నాగరాజు

**సంక్షేమ సాక్షి కర్నూలు** : కర్నూలు నగరంలోని నంద్యాల చెక్ పోస్టు సమీపంలో గల కేంద్రీయ విద్యాలయాన్ని ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు...ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులను ఆయన పర్యవేక్షించారు... తరగతి గదులను పరిశీలించి ఎలా చదువుతున్నారు, భవిష్యత్తు లో ఏమి కావాలని కోరుకుంటున్నారని విద్యార్థులతో మాట్లాడిన ఎంపీ, కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని సూచించారు..అనంతరం విద్యార్థులకు మరింత నాణ్యమైన, అనుభవపూర్వకమైన విద్యను అందించాలని, మౌలిక సదుపాయాలలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బందికి ఆదేశించారు..



## శాంతి భద్రతల పరిరక్షణకు సెక్షన్ 30
# పోలీసు యాక్ట్ అమలు

**ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేదు...**

**కర్నూల్ డీఎస్పీ రాఘవేంద్ర**

**సంక్షేమ సాక్షి కర్నూలు** : కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కర్నూలు నగరంలో, గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా ప్రశాంతత దృష్ట్యా భారతీయ పోలీస్ చట్టం 1861లోని సెక్షన్ 30 పోలీసు యాక్ట్ ఉత్తర్వులు అమల్లో ఉన్నాయని కర్నూల్ డీఎస్పీ రాఘవేంద్ర శనివారం తెలిపారు. కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో తరచుగా జరుగుతున్న ధర్నాలు, ఆందోళనలు, రాస్తారోకోలు తదితర కార్యక్రమాల వల్ల శాంతిభద్రతలకు భంగం కలిగే అవకాశం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కర్నూల్ డీఎస్పీ రాఘవేంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. ముందస్తు లిఖితపూర్వక అనుమతి లేకుండా ప్రజా సమావేశాలు, ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అనుమతుల కోసం ఆర్గనైజర్లు, నిర్వాహకులు ముందుగానే సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ ఉత్తర్వులు జులై 31 వరకు కర్నూలు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో అమల్లో ఉంటాయని తెలిపారు.




## మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుని
# ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

**జిల్లా టూరిజం అధికారిని కే.విజయలక్ష్మి**

**సంక్షేమ సాక్షి నంద్యాల** : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో నడవాలని జిల్లా టూరిజం అధికారిని కె.విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు శ్రీ అల్లూరి సీతారామరాజు129 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా టూరిజం అధికారిని విజయలక్ష్మి మాట్లాడుతూ... అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర మహా సంగ్రామంలో మహోజ్వల శక్తిగా వెలుగొందారని, అల్లూరి సీతారామరాజు విజయనగరం సమీపంలోని పాండ్రంగిలో జన్మించారని, ఆరవ తరగతి చదువుతున్న వయసులోనే తండ్రిని కోల్పోవడం ఆయన జీవితంలో పెనుమార్పులే తీసుకువచ్చిందన్నారు. కొండలు, అడవులలో తిరుగుతూ, గిరిజనుల జీవన విధానాన్ని గమనిస్తూ ఉండేవారని, జ్యోతిష్యం, వాస్తు శాస్త్రం, హఠ యోగం, కవిత్వం నేర్చుకున్నారని, వీటితో పాటు సంస్కృతం, ఆయుర్వేదం కూడా నేర్చుకున్నారన్నారు. ఆ రోజుల్లో ఏజన్సీ ప్రాంతంలోని ప్రజలు తెల్లదొరల చేతిలో అనేక దురాగతాలకు, దోపిడీలకు, అన్యాయాలకు గురయ్యేవారని, శ్రమదోపిడి, ఆస్తుల దోపిడి, స్త్రీల మానహరణం సర్వసాధారణంగా జరుగుతూ మన్యంలో గిరిజనుల జీవితం దుర్భరంగా ఉండేవన్నారు. మన్యం వాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాడిన మహా వ్యక్తి అల్లూరి సీతారామరాజు అన్నారు. అల్లూరి సీతారామ రాజు ఆంధ్రప్రదేశ్ లో జన్మించడం అందులో మన తెలుగువాడిగా పుట్టడం మనం గర్వించదగ్గ విషయమన్నారు. గిరిజన ప్రజల అభ్యున్నతికి పాటుపడిన అల్లూరి సీతారామరాజు 27 ఏళ్ళ వయసులోనే అమరవీరుడయ్యాడని తెలిపారు. దేశ స్వాతంత్రం కోసం తెల్లవారితో పోరాడిన మహావీరుడు అల్లూరి సీతారామరాజును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సుబాకర్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



Printed, Edited, Published and Owned by KURUVA SRINUVASULU, Printed at Uttejitha Publications# 48-80 1 U2, Budhwarapet, A.camp, Kurnool-518002, A.P.,
Publeshed from H.No. 91/4-31-3-1B BAAJI NAGAR Kurnool-518006, AP, RNI APTEL/2022/82637,Cell: 9951813334, e-mail : sankshemasaakshi@mail.com